## బెంగాల్‌పై కన్నేస్తే..
# పాక్ ముక్కలే

- పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్
- రెచ్చగొట్టే ప్రకటనలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ,ఏప్రిల్7(నినాదం): పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాం గ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు. ▸▸తరువాయి 2లో..



కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని అన్నారు.


ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

| బుధవారం, ఏప్రిల్ 8, 2026 | సంపుటి - 22 | సంచిక 191 | వెల - 7 | పేజీలు - 12 - 8 |
|---|---|---|---|---|

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam





## ఐటీ కారిడార్‌లో హైడ్రా భారీ ఆపరేషన్
### 12 వందల కోట్ల విలువైన 8 ఎకరాలు స్వాధీనం

**హైదరాబాద్, (నినాదం):** ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. మంగళవారం ఖానామెట్ లో రూ. 12 వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి కాపాడింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..ఐటీ కారిడార్ కు చేరువలోని ఖానామెట్ లో 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించింది హైడ్రా.

2

## వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు
### పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం

**హైదరాబాద్, (నినాదం):** తెలుగు రాష్ట్రల్లో వచ్చే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది.





## కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ
### కోడై కూస్తున్న అంతర్జాతీయ మీడియా

6

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ చాలా రోజుల నుంచి కోమాలో ఉన్నారన్న వార్త ఇప్పుడు ప్రపంచమంతా దావానలంలా వ్యాపిస్తోంది. ప్రస్తుతం ఖోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని కోడై కూస్తోంది.




## ఇకనుంచి 5 కెజీల 2 సిలిండర్ల సరఫరా
### వలస కార్మికులకు కేంద్రం శుభవార్త
### రాష్ట్రాలకు సూచించిన కేంద్రం

న్యూఢిల్లీ, నినాదం: వలస కార్మికులకు కేంద్రం ఊరట కలిగించింది. వారికి గ్యాస్ సరఫరాపై పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వలస కార్మికులకు 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది.

2




## ఐదు రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్
# నిషేధం
### 9 నుంచి 29 వరకు అమలు

కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల

# 900 రోజులైంది..
## 6 గ్యారెంటీలు
# ఏవీ

- పరిగిలో భూములు లాక్కునే యత్నం
- సిఎం రేవంత్‌పై విరుచుకుపడ్డ హరీష్ రావు
- పరిగి వెళుతున్న హరీష్ రావు తదితరుల అరెస్ట్
- శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు



*పరిగిలో భూముల లాక్కొని తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు చెరిగారు. 6 గ్యారెంటీలు 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు.*

**హైదరాబాద్,ఏప్రిల్7(నినాదం):**

సీఎం రేవంత్ రెడ్డిపై బీఆరఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ రావు మళ్లీ నిప్పులు చెరిగారు. మంగళవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద హరీశ రావు మాట్లాడుతూ.. రేవంత్ నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు. ▸▸తరువాయి 2లో..

# ఇరాన్‌పై భీకర దాడులు
## గడువుకు ముందే ఖర్గ్ ద్వీపంపై బాంబులు

- అమెరికా, ఇజ్రాయెల్ కలిసి దాడి
- విద్యుత్ ప్లాంట్లు, బ్రిడ్జ్‌లే లక్ష్యంగా..
- చూస్తూ ఊరుకోం.. అమెరికా, ఇజ్రాయెల్, వాటి మిత్ర దేశాలపై దాడులు చేస్తాం: ఇరాన్



2 వివరాలు

**ఇరాన్,ఏప్రిల్7(నినాదం):**

పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత చేదాటుతున్నాయి. ట్రంప్ హెచ్చరించినట్లుగానే గడువు కు ముందే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ భీకర దాడులు చేపట్టాయి. విద్యుత్ ప్లాంట్లు, బ్రిడ్జ్‌లు లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. ఇరాన్‌లో ని ఖర్గ్ ద్వీపంపై కూడా అమెరికా క్షిపణి దాడులు చేసింది. అలాగే కరాజ్ నగరంలో విద్యుత్ ప్లాంట్‌పై దాడి చేయగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చమురు కేంద్రమైన ఖార్గ్ ద్వీపాన్ని లక్ష్యంగా చేసుకుని పలు దాడులు జరిగాయని ఇరాన్‌కు చెందిన మెహర్ న్యూస్ పేర్కొంది. ఇక ఇరాన్‌లో రైల్వే సర్వీసులు కూడా నిలిచిపోయాయి.

## ఇరాన్ నాగరికత అంతమైపోవడం ఖాయం

- ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు
- హర్మూజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు
- మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల' వేదికగా పోస్టు పెట్టారు.



## ప్రాచీన ఆచారాలు కేవలం మత విశ్వాసాలకు సంబంధించినవే

- ఇందులో మహిళల పట్ల వివక్ష లేదని కేంద్రం వాదన
- శబరిమలలో మహిళల ప్రవేశంపై నిషేధం అంశంలో..
- 9మంది జడ్జిల సుప్రీం విస్తృత ధర్మాసనం విచారణ

2 వివరాలు



ప్రాచీనకాలం నుంచి కొనసాగుతోన్న సంప్రదాయాలకు అనుగుణంగానే శబరిమల ఆలయంలో మహిళలకు ప్రవేశ నిషేధం విధించారు కానీ.. దీనికి సంబంధించి వివక్ష ఏమీ లేదని కేంద్రం సుప్రీం కోర్టుకు తెలిపింది.

**న్యూఢిల్లీ,ఏప్రిల్7(నినాదం):**

మహిళల ప్రవేశాన్ని అనుమతించడమనేది ఆరాధనా స్వరూపాన్నే మార్చివేస్తుంది. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా శతాబ్దాలుగా భక్తులు స్వామిని పూజిస్తున్నారని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వెల్లడించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి గతంలో వెలువడిన తీర్పును మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది జడ్జీల ధర్మాసనం సమీక్షిస్తోంది. ఈమేరకు పిటిషన్‌దారుల వాదనలు వింటోంది. దీనికి ముందు కేంద్రం తన వివరణను సమర్పించింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినదని పేర్కొన్నారు.

## మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తత
### నిరసనకారులకు,పోలీసులకు మధ్య ఘర్షణ

మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. బిష్ణుపూర్‌జిల్లాలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చెలరేగినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఆగ్రహించిన పోలీసులు ఆందోళనకారులపై కాల్పులకు దిగారని అన్నారు.



## పాక్‌లో తీవ్ర ఇంధన కొరత
### లాక్‌డౌన్ తరహా ఆంక్షలు విధింపు

ఇస్లామాబాద్, నినాదం: హోర్ముజ్ జలసంధి మీదుగా ముడి చమురు, సహజవాయువు రవాణా నౌకల రాకపోకలపై ఇరాన్ ఆంక్షలు విధించిన నేపథ్యంలో ప్రపంచాన్ని ఇంధన సంక్షోభం భయపెడుతోంది. ఇంధన కొరత ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌లో ప్రభుత్వం తాజాగా లాక్‌డౌన్ తరహా ఆంక్షలకు తెరతీసింది.

2



## రేవంత్‌తో చర్చకు తెలంగాణలో పార్టీలు ఉన్నాయ్..

- రేవంత్ సవాల్‌ను తిప్పికొట్టిన పినరయ్
- తెలంగాణలో మా పార్టీ వారు చూసుకుం

**తిరువనంతపురం, నినాదం:**

తనతో చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై కేరళం ముఖ్యమంత్రి పినరయి విజయన్ తిప్పికొట్టారు. ఆయనతో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదన్నారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణలో పార్టీలు ఉన్నాయని, ఆయన ప్రభుత్వ పనితీరుపై అక్కడి ప్రజలే తీర్పునివ్వాలని వ్యాఖ్యానించారు. తమ పార్టీ నేతలు అక్కడ రేవంత్ వ్యవహారంపై మాట్లాడుతారని అన్నారు. నీతి ఆయోగ్ 2023`24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచీలో కేరళ తొలి



స్థానంలో ఉందని పినరయి విజయన్ అంటున్నారని, ఇది కేరళలో ఏడు దశాబ్దాల ప్రభుత్వాలన్నింటి కృషి అని సోమవారం సీఎం రేవంత్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

2 తరువాయి

## విజయన్, మోడీ మంచి మిత్రులు

- రాష్ట్ర యువతను మోసం చేస్తున్న పినరయ్
- కేరళంలో ఇక ఎల్‌డిఎఫ్‌కు కాలం చెల్లింది
- ప్రచారంలో సిఎం రేవంత్ రెడ్డి విమర్శలు



**తిరువనంతపురం,ఏప్రిల్ 7(నినాదం):**

కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారనికేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు.

## తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసింది

2 తరువాయి

- కర్రెగుట్టల్లో స్వేచ్ఛగా తిరిగే వెసలుబాటు
- మావోయిస్టు అడ్డాలో అభివృద్ధి పరుగులు
- డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి



## యూరియాను శాస్త్రీయంగా వాడాలి

- అధిక వాడకం వల్ల భూసారం తగ్గిపోతుంది
- యూరియా యాప్‌పై హర్షం వ్యక్తం చేసిన రైతులు : మంత్రి తుమ్మల

**హైదరాబాద్,ఏప్రిల్7(నినాదం):**

దేశంలోనే అధికంగా యూరియా వాడుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉందని, ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు యూరియాను అధికంగా వినియోగించవద్దని కోరారు. యూరియాను అధికంగా వాడటం వల్ల, నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు, రానురాను దిగుబడులు కూడా తగ్గుతాయని, చీడ పీడల సమస్యలు పెరుగుతాయని తెలిపారు. ఇప్పుడు పంటల కోతల సమయం వచ్చిందని, రైతులు కోతల అనంతరం వచ్చే పంట వ్యర్థాలను కాల్చవద్దని అన్నారు. పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. ▸▸తరువాయి 2లో..



# రాజకీయం కోసం అభివృద్ధికి మోకాలడ్డరాదు !

సంపాదకీయం

రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు. ఈ రెంటిని కలగలిపి చూస్తే..అభివృద్ధి వెనక్కి పోతుంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన విషయంలో ఇదే జరుగుతోంది. ఎపిలో అమరావతి విషయంలనూ ఇదే కనిపిస్తోంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఇప్పుడు చూపిన నమూనా ప్రకారం ముందుకు వెళితే మంచిదే. అదేవిధంగా నిర్వాసితులకు ఉత్తమ ప్యాకేజీ, వారు ఆనందపడిపోయేలా ఉండాలి. ఇల్లుకు ఇల్లు, జాగాకు జగా అందాలి. మూసీని ప్రక్షాళన చేయడంలో ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. అలాగే మురుగనీటిని ఎలా, ఎక్కడికి తరలిస్తారన్నది కూడా పెద్ద సమస్య. హైదరాబాద్ మురుగునీటిని ఇంతకాలం మూసీలో పారబోస్తున్నారు. దానికి ప్రత్యామ్నాయం చూపాలి. ఇకపోతేమూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్న బిఆరఎస్, బిజెపిలు ప్రత్యామ్నాయాలు చూపడం లేదు. ఇలా చేద్దామని సలహాలు ఇవ్వడం లేదు. ఎందుకంటే ఇది రాజకీయం. రాజకీయాన్ని అభివృద్ధితో ముడిపెట్టడం వల్లనే మూసీ ప్రక్షాళనను ఈ రెండు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. పదేళ్లు పాలించిన బిఆరఎస్ తెలంగాణ అడుక్కితునేలా చేసింది. ఇలాంటి రాజకీయాల వల్లనే తెలంగాణ మరింత వెనకబాటుకు గురవుతుంది. ఇకపోతే అమరావతి విషయంలో జగన్, ఆయన అనుచరగణం చేస్తున్న విమర్శలు, రాజకీయాలు చూస్తుంటే..ఇలాంటి నాయకులు ఉన్నందుకు సిగ్గుపడాలి. అమరావతి రాజధాని నిర్మాణం అవసరం. కానీ అసలు రాజధానే అవసరం లేదంటున్న వారు రాజకీయాల్లో ఉండడానికి లేదు. 2019 ఎన్నికల్లో 151 సీట్ల భారీ మెజారిటీని జగన్ మోహన్ రెడ్డికి కట్టబెడితే చేసిందేమిటి. ఆనాడు మావిగన్ ఆలోచన ఎందుకు రాలేదు. ఆనాడు మడు రాజధానులంటూ ఎందుకు ఊరేగారు. రాజధాని అవసరం లేదన్న వారు ఐదేళ్లు కాలయాపన చేశారు. అప్పటి నుంచి జగన్ రాజకీయ నిజస్వరూపం వెల్లడవుతూ వచ్చింది. ప్రజలకు ఆయన ఏమిటో బోధ పడింది. కక్షలు, కార్పణ్యాలు, అసూయా ద్వేషాలతో ఐదేళ్లపాటు సాగించిన పాలనతో ప్రజలకు చైతన్యం వచ్చి ఉండాలి. ఎందుకంటే ఇలాంటి నేతను మోసినందుకు సిగ్గుపడాలి. రాజకీయాల్లో వైఫల్యాలను గుణపాఠాలుగా మలచుకొని ముందుకు సాగాలి. కానీ ఇక్కడ బిఆరఎస్, అక్కడ జగన్ పార్టీకి ఇవేవీ కానరావడం లేదు. ఇప్పటికీ ఈ రెండు పార్టీల నేతలకు జ్ఞానోదయం కావడం లేదు. వారికి కావలసిం దల్లా అధికార పీటం తప్ప, అభివృద్ధి కాదు. భజనపరులు చుట్టూ ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ప్రజా వ్యతిరేకత కనిపించదు. ప్రజలకు డబ్బు పంచితే గంపగుత్తగా ఓట్లు పడతాయని లెక్కలు వేసుకున్న నేటి విపక్ష నేతలు ఆనాడు మళ్లీ తమదే అధికారం అని ఢంకా బజాయించారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని పాలన చేయాలి. ఇప్పుడు రేవంత్ రెడ్డి అయినా అదే చేయాలి. ఎందుకంటే భూకబ్జాలపై వస్తున్న ఆరోపణలపై మేల్కోవాలి. వెంటనే ఖండించాలి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడిపై విపరీతమైనా ఆరోపణలు ఉన్నాయి. వీటిని ఖండించకపోవడంతో అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి. రేవంత్ ఇలాంటి విషయాలపై ఖచ్చితంగా లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఆయన కూడా మూసీలో కొట్టుకు పోవడం ఖాయం. నిర్మాణాత్మక పనులు ఇంకా రేవంత్ మొదలు పెట్ట లేదు. ఎంతసేపు రేషన్ కార్డులు, సన్నబియ్యం, చీరలు, ఫ్రీ బస్సు వంటివే కనిపిస్తున్నాయి. ఇవేవీ అభివృద్ధి కాదని గుర్తించాలి. ఇకపోతే ఆనాడు వైనాట్ 175 అన్న జగన్ ఇప్పుడు మళ్లీ మనదే అధికారం అంటున్నారు. తెలంగాణలో కెటిఆర్ కూడా అదే మాట్లాడుతున్నారు. ఎపిలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావస్తోంది. ఇంకేముందీ ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ఇక ఉన్నది రెండేళ్ల కాలమని, చివరి సంవత్సరం అంతా ఎన్నికలకే పోతుందని, తన పాదయాత్ర కూడా ఉంటుందని జగన్ నమ్మబలుతుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలను ప్రజలు మరచిపోరని ఏ పార్టీ అయినా గుర్తించాలి. అధజకారంలో ఉన్నప్పుడు జగన్‌కు మావిగన్ ఆలోచన రాలేదు. అంటే అమరావతి వి ద ద్వేషంతో చేస్తున్నదే అని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. మహా నగరాలతో 'మావిగన' పోటీ పడుతుందని ప్రచారం కూడా మొదలెట్టారు. రాజ్యాంగంలో రాష్ట్రాలకు రాజధాని అనే పదం లేదని జగన్ చెప్పడం చూస్తుంటే, ఇలాంటి వ్యక్తిని ఎందుకు ఆదరించాలో ప్రజలు కూడా ఆలోచించాలి. హైదరాబాద్ మహా నగరం నుంచి వస్తున్న ఆదాయంతోనే తెలంగాణ నడుస్తోంది. ఇప్పుడు రేవంత్ ఫ్యూచర్ సిటీ అంటున్నారు. ఇది సాధ్యామా అన్నది కూడా ఆలోచించాలి. నగరాలు వాటంతటే అవే రావాలి తప్ప, చేస్తే రావు. అరావతి వేరు...ఫ్యూచర్ సిటీ వేరు అని గుర్తించాలి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుతం విశాఖపట్నం నుంచి అధికంగా ఆదాయం వస్తోంది. అమరావతి మహా నగరంగా అభివృద్ధి చెందితే రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి, అందులో కొంత భాగాన్ని విక్రయించి ఆ డబ్బుతో మౌలిక వసతులు కల్పించబోతున్నారు. హైదరాబాద్ ఇప్పటి రూపం సంతరించుకోవడానికి మూడు దశాబ్దాలకు పైగా పట్టింది. అభివృద్ధి అనేది నిరంతర పక్రియ. సంకుచితంగా ఆలోచించేవారు అభివృద్ధి గురించి ఆలోచించలేరు. అందుకే రాజకీయాలు వేరు. అభివృద్ధి వేరు. రాజకీయ పార్టీల నేతలకు దూరదృష్టి ఉండాలి. అభివృద్ధిపై అవగాహన ఉండాలి. వందేళ్ల ముందు గురించి ఆలోచించాలి. అంతేగాని రాజకీయాలతో వెనకేసుకుని బతుకుదామనుకునే వారు పాలకులు కాబోరు.

# సిఎస్‌కెకు ఏమయ్యింది?



**నాయకత్వ సమస్యతో సతమతం**

**వరుసగా మూడు మ్యాచ్‌లు ఓటమిపై ఆందోళన**

**ఐపిఎల్ మ్యాచ్‌లో అతి పేలవ ప్రదర్శనలో చెన్నై సూపర్‌కింగ్ సిఎస్‌కే ముందున్నదీ. నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ధోనీ అందులో ఉన్నంత సేపు ఊపులో ఉన్న సిఎస్‌కె ఇప్పుడు అత్యంత పేలవ ప్రదర్శన ఇస్తోంది. సొంత మైదానం చిదంబరం స్టేడియంలో ఐపిఎల్ మ్యాచ్ అంటే.. పసుపు జెర్సీలతో కళకళలాడుతుంది. అలాంటి చెన్నై సూపర్‌కింగ్స్ ఈ సీజన్‌లో ఆడి 3మ్యాచుల్లోనూ ఘోర పరాజయాలను చవి చూసింది.**

ఈ ఓటములు కెప్టెన్సీ లోపం కారణంగా వస్తున్నాయా..? ఫినిషింగ్ కింగ్ మహేంద్ర సింగ్ ధోనీ, బ్రెవీస్ జట్టుకు అందుబాటులో లేకపోవడమో.. ఇలా జరుగుతున్నాయా.. అనేది సగటు ప్రతి చెన్నై అభిమానిని కలచివేస్తోంది. ధోనీ కెప్టెన్సీ త్యాగం చేసిన తర్వాత రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో ఆ జట్టు ఆడిన 22మ్యాచుల్లో ఏకంగా 14 మ్యాచుల్లో ఓటమిపాలైంది. ఒకప్పుడు చెన్నై సూపర్‌తో మ్యాచ్ అంటే ప్రత్యర్థి జట్లకు వణుకు పుట్టేది. అంతటి గొప్ప రికార్డు చెన్నై సూపర్‌కింగ్స్ సొంతం. ఆ జట్టు అత్యధికంగా ఐదుసార్లు ఐపిఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. 2010, 2011, 2018, 2021, 2023లలో ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై.. ఆ తర్వాత సీజన్ 2024లో ఆడిన 14మ్యాచుల్లో 7మ్యాచుల్లో మాత్రమే గెలిచింది. ఇక 2025 సీజన్‌లో అయితే.. 14మ్యాచుల్లో 4మ్యాచుల్లో గెలిచి చిట్టచివరి స్థానంలో నిలిచింది. ఇక 2026సీజన్‌లో ఆడిన 3మ్యాచుల్లోనూ చిత్తుగా ఓడింది. గౌహతి వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 8వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగి కేవలం 127పరుగులకే కుప్పకూలింది. ఆ లక్ష్యాన్ని రాజస్తాన్ జట్టు కేవలం 12.1ఓవర్లలోనే ఛేదించింది.



ఇక సొంతమైదానం చిదంబరం స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌పై 209 పరుగుల భారీస్కోర్‌ను కొట్టింది. ఆ లక్ష్యాన్ని పంజాబ్ జట్టు మరో 8బంతులు మిగిలి ఉండగానే ఛేదించి 5వికెట్ల తేడాతో విజయం సాధించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకొన్న గైక్వాడ్ నిర్ణయాన్ని బౌలర్లు సద్వినియోగం చేసుకోలేక పోయారు.. దీంతో ఆర్సీబీ 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 250పరుగుల భారీస్కోర్ చేసింది. ముఖ్యంగా టిమ్ డేవిడ్(70నాటౌట;25బంతుల్లో 3ఫోర్లు, 8సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి చెన్నై బౌలర్లకు చుక్కలు చూపించాడు. అనంతరం చెన్నై 19.4ఓవర్లలో 207పరుగులకే కుప్పకూలింది. ఆర్సీబీ చేతిలో 43పరుగుల తేడాతో ఓడిన చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఈ సీజన్‌లో వరుసగా ఇది మూడో ఓటమి. దీంతో రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి ప్రధాన కారణంగా.. గైక్వాడ్ కెప్టెన్సీలో చెన్నై ఆడిన 22 మ్యాచుల్లో 14మ్యాచుల్లో ఓటమిపాలైంది. సీజన్ తొలి మ్యాచ్‌లకు మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ, స్టార్ ఆల్‌రౌండర్ బ్రెవీస్ దూరమయ్యారు. ధోనీ గాయం కారణంగా, ఫిట్‌నెస్ కారణాలతో బ్రెవీస్ కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యారు. దీంతో కీపింగ్ బాధ్యతలను టీమిండియా టి20 స్టార్, వరల్డ్‌కప్ విజేత సంజూ శాంసన్ వికెట్ కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. పవర్ హిట్టర్ డెవాల్డ్ బ్రెవిస్ కూడా ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే చెన్నై తదుపరి ఆడే మ్యాచ్‌లకు వీరిద్దరూ అందుబాటులో ఉంటారని సమాచారం. బ్రెవీస్, ధోనీ ఫిట్‌నెస్ సాధించారని వీరిద్దరూ తదుపరి మ్యాచ్‌కు చెన్నై జట్టులో ఎంట్రీకి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. మధ్య ఓవర్లలో విధ్వంసకర బ్యాటింగ్‌తో విరుచుకుపడగల సత్తా బ్రెవీస్ సొంతం. ఇక ఆర్సీబీతో మ్యాచ్‌లో ఓటమి తర్వాత సీఎస్‌కే హెడ్‌కోచ్ స్టీఫెన్ ప్లెమింగ్ మాట్లాడుతూ.. 'తదుపరి మ్యాచ్‌వరకు అంతా సర్దుకుంటుందనే అనుకుంటున్నాం. తర్వాతి మ్యాచ్‌కు మాకు ఐదు రోజుల సమయం ఉంది. ఈ ఓటమి బాధించింది. అయితే, మా ప్రణాళికలకు అనుగుణంగా తదుపరి మ్యాచ్‌లో ముందడుగు వేయగలమనే నమ్మకం ఉంది' అని పేర్కొన్నాడు. చెన్నై తదుపరి మ్యాచ్ సొంత మైదానం చెపాక్ వేదికగా ఏప్రిల్ 11న ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది.

## కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

**కోడై కూస్తున్న అంతరఆజయాయ మీడియా**



ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ చాలా రోజుల నుంచి కోమాలో ఉన్నారన్న వార్త ఇప్పుడు ప్రపంచమంతా దావానలంలా వ్యాపిస్తోంది. ప్రస్తుతం ఖోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని కోడై కూస్తోంది. ఇరాన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలలో మొజ్తాబా ప్రమేయం ఏమీ లేదని అంతర్జాతీయ వి డియా అంటోంది. మొజ్తాబా ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నట్టు అమెరికా` ఇజ్రాయెల్ దేశాల నిఘా సంస్థలకు తెలుసని అంతర్జాతీయ వి డియా పేర్కొంది. మొజ్తాబా తీవ్ర అనారోగ్యంతో ఉన్నందువల్ల నిర్ణయాలు తీసుకోలేని స్థితిలో ఉన్నారని తెలిపింది అమెరికా`ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన కుమారడు మొజ్తాబా ఖమేనీని తదుపరి సుప్రీం లీడర్‌గా ఎన్నుకున్నారు. సుప్రీం లీడర్ అయిన తర్వాత కూడా మొజ్తాబా ఎక్కడా కనిపించలేదు. మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డారని, ప్రాణాలు కూడా కోల్పోయి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అప్పట్లో అన్నారు. ఖమేనీని చికిత్స నిమిత్తం రష్యాలోని మాస్కోకు తరలించారని కూడా వార్తలు వచ్చాయి. రిజ్తాబా ఖమేనీ ఇరాన్‌లోనే ఉన్నారని, బయటకు వెల్లడించలేని కారణాల వల్ల ఆయన బహిరంగంగా కనిపించడం లేదని రష్యా రాయబారి తెలిపారు . కాగా, మొజ్తాబా ఖమేనీ ఆరోగ్యంపై వచ్చిన ఈ వార్తలు ఇరాన్ రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీసే అవకాశం ఉంది. అయితే ఇప్పటివరకు ఇరాన్ ప్రభుత్వం లేదా అధికార వర్గాలు ఈ వార్తను అధికారికంగా ధ్రువీకరించలేదు. అందువల్ల ఇప్పటికి ఇవి కేవలం నివేదికల ఆధారంగా వచ్చిన సమాచారం మాత్రమే.

# ఎన్నికల నిర్వహణ: అభ్యర్థులపై నిఘా..

## అధికారుల 'పద్దు'లపై ఉదాసీనత?

**మున్సిపల్ ఎన్నికల నిర్వహణ: అడ్డగోలు ఖర్చులు**



ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అనేవి కేవలం ఓట్ల పండుగ మాత్రమే కాదు, అవి ప్రజల ఆకాంక్షలకు, పరిపాలనా పారదర్శకతకు అద్దం పట్టే కీలక యంత్రాంగాలు. ముఖ్యంగా స్థానిక సంస్థలైన మున్సిపల్ ఎన్నికలు క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయి. అయితే, ఈ ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వ యంత్రాంగం చూపే ఆర్థిక లెక్కలు, వాస్తవ వ్యయాల మధ్య కనిపిస్తున్న అగాధం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు నుండి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యే వరకు ప్రతి దశలోనూ వేల కోట్ల ప్రజాధనం వ్యయం అవుతున్నప్పటికీ, అందులో పారదర్శకత కొరవడటం ఆందోళనకరం. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎంత ఖర్చు చేయాలి, వారి ప్రచార వ్యయం ఎంత ఉండాలి అనే అంశాలపై నిశితంగా నిఘా ఉంచే ఎన్నికల సంఘం, అదే ఎన్నికలను నిర్వహిస్తున్న అధికారుల ఖర్చుల విషయంలో మౌనం వహించడం లేదా ఉదాసీనంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలోని వైరుధ్యాన్ని ఎత్తిచూపుతోంది. అభ్యర్థుల ఖర్చును నియంత్రించే యంత్రాంగం, అధికార యంత్రాంగం చేస్తున్న అనవసర వ్యయాలను, అక్రమ మళ్లింపులను ఎందుకు ప్రశ్నించడం లేదనేది ఒక అపరిష్కృత ప్రశ్నగా మిగిలి పోయింది.

ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ప్రధానంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, శిక్షణ, భద్రత, ఈవీఎంల రవాణా, ఓటర్ల అవగాహన వంటి విభాగాలకు భారీగా నిధులు కేటాయిస్తారు. మున్సిపల్ ఎన్నికల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు అవుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అయితే, క్షేత్రస్థాయి పరిశీలనలు మరియు ఆడిట్ నిపుణుల విశ్లేషణల ప్రకారం, ఇందులో కనీసం 30 నుండి 40 శాతం మేర వ్యత్యాసం ఉంటున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు, ఒక పోలింగ్ కేంద్రం వద్ద కనీస సౌకర్యాలైన తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్, పారిశుధ్యం కోసం కేటాయించినట్లు కాగితాలపై రాస్తారు. కానీ వాస్తవానికి అక్కడ కనీసం సౌకర్యాలు కూడా ఉండవు. తాత్కాలిక షామియానాలు, కుర్చీల అద్దెల పేరుతో మార్కెట్ ధర కంటే అత్యధికంగా బిల్లులు సృష్టించడం పరిపాటిగా మారింది. ఇలా లక్షల వరకు అక్రమ మళ్లింపు జరుగుతోందని అంచనా. ఇలాంటి చిన్న చిన్న వ్యత్యాసాలే రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్ల రూపాయల అవినీతికి దారితీస్తున్నాయి.

శిక్షణా తరగతుల పేరుతో ఏర్పాటు చేసే భోజన వసతులు, స్టేషనరీ కొనుగోళ్లలో కూడా భారీగా కమిషన్లు చేతులు మారుతున్నాయి. భద్రతా ఏర్పాట్ల పేరుతో జరిగే వ్యయం మరీ విడ్డూరంగా ఉంటుంది. పోలీసు బలగాల రవాణా కోసం వాహనాల అద్దె, ఇంధనం పేరుతో చూపే ఖర్చులు ఆడిట్ పరిధిలోకి రాకపోవడం అవినీతికి రాజమార్గంగా మారుతోంది. ఒకే వాహనాన్ని రెండు మూడు విభాగాలకు వినియోగించినట్లు చూపి, వేర్వేరుగా బిల్లులు డ్రా చేయడం వంటి సంఘటనలు గతంలో అనేక ఆడిట్ నివేదికల్లో వెలుగుచూశాయి. అత్యవసర పరిస్థితి (Emergency Requirement) అనే సాకుతో టెండర్లు పిలవకుండానే నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగించడం వల్ల ఖర్చు అమాంతం పెరుగుతోంది.

ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఎన్నికల సంఘం అభ్యర్థులపై చూపే కఠినత్వం అధికారుల విషయంలో లేకపోవడం. అభ్యర్థి ప్రచార రథం ఖర్చు, టీ కప్పుల ఖర్చు, జెండాల సంఖ్యను లెక్కించే పరిశీలకులు, ఎన్నికల నిర్వహణలో జరుగుతున్న ప్రజాధనం దుర్వినియోగాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదన్నది చర్చనీయాంశం. అభ్యర్థి ఖర్చుకు పరిమితి విధించడం వెనుక ఉన్న ఉద్దేశం "సమాన అవకాశాలు" (Level Playing Field) కల్పించడం అయితే, అధికారుల అడ్డగోలు ఖర్చులను నియంత్రించడం వెనుక ఉన్న ఉద్దేశం "ప్రజాధన రక్షణ" కావాలి. కానీ, ఎన్నికల సమయం ముగియగానే యంత్రాంగం అంతా పద్దులను సర్దడంలో నిమగ్నమవుతుంది తప్ప, వాటిపై స్వతంత్ర సంస్థలతో విచారణ జరిపించిన దాఖలాలు తక్కువ. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (CAG) వంటి సంస్థలు సాధారణంగా వార్షిక ఆడిట్ చేస్తాయి కానీ, ఎన్నికల వంటి ప్రత్యేక సందర్భాల కోసం ప్రత్యేకమైన, వేగవంతమైన ఆడిట్ వ్యవస్థ లేకపోవడం పెద్ద లోపం. రాష్ట్ర ఎన్నికల సంఘాలు ఈ వ్యయాలపై కచ్చితమైన మార్గదర్శకాలను జారీ చేయాల్సిన అవసరం ఉంది.

ఓటర్ల అవగాహన కార్యక్రమాల (SVEEP) పేరుతో జరిగే ఖర్చు కూడా ఒక ప్రహసనంగా మారింది. హోర్డింగులు, గోడ పత్రికలు, ప్రచార వాహనాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు చూపిస్తున్నా, అవి కేవలం ప్రధాన కార్యాలయాలకే పరిమితం అవుతున్నాయి. మారుమూల వార్డుల్లో ఓటర్లకు కనీస సమాచారం కూడా అందడం లేదు. డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ద్వారా తక్కువ ఖర్చుతో అవగాహన కల్పించే అవకాశం ఉన్నప్పటికీ, పాత పద్ధతిలో కాంట్రాక్టర్లకు మేలు చేసేలా భారీ వ్యయంతో కూడిన ప్రకటనలకే అధికారులు మొగ్గు చూపుతున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (EVM) రక్షణ, నిల్వ కోసం ఉపయోగించే స్ట్రాంగ్ రూమ్‌ల అద్దెలు, అక్కడ ఏర్పాటు చేసే సీసీటీవీల ఖర్చులు మార్కెట్ ధర కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉండటం వ్యవస్థాత్మక అవినీతికి నిదర్శనం. ఈ రకమైన వ్యయాల వల్ల ప్రభుత్వ ఖజానాపై అనవసర భారం పడటమే కాకుండా, పరిపాలనా యంత్రాంగంపై ప్రజల్లో ఉన్న నమ్మకం సడలుతోంది.

ఈ దుస్థితిని మార్చాలంటే సమూల ప్రక్షాళన అవసరం. ప్రతి మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణ కోసం కేటాయించిన బడ్జెట్ మరియు ఖర్చు చేసిన వివరాలను "ఓపెన్ డేటా" విధానంలో ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఎన్నికల నిర్వహణ ఖర్చుపై ఒక స్వతంత్ర ఆడిట్ కమిటీని నియమించి, ఫలితాలు వెలువడిన 30 రోజుల్లోపు నివేదికను బహిర్గతం చేయాలి. అభ్యర్థుల వ్యయాన్ని పర్యవేక్షించేందుకు నియమించినట్లుగానే, అధికార యంత్రాంగం ఖర్చును పర్యవేక్షించేందుకు "వ్యయ పరిశీలకులను" (Expenditure Observers for Administration) నియమించాలి. టెక్నాలజీని ఉపయోగించి ప్రతి కొనుగోలును ఈ-ప్రొక్యూర్మెంట్ ద్వారానే జరపాలి. ఒకవేళ ఏ అధికారి అయినా నిధులను దుర్వినియోగం చేసినట్లు తేలితే, వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఎన్నికల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుంది. ప్రజాస్వామ్య విలువలు కాపాడబడాలంటే అటు అభ్యర్థులు, ఇటు అధికారులు ఇద్దరూ జవాబుదారీగా ఉండాలి. ప్రజాధనం ప్రజల అవసరాల కోసం ఖర్చు కావాలి కానీ, ఎన్నికల పేరిట అధికారుల జేబులు నింపడానికి కాదు. చైతన్యవంతమైన సమాజం ఈ వ్యత్యాసాలను ప్రశ్నించినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**

# అంతర్జాతీయంగా అనిశ్చితి

**ఒడిదుడుకుల్లో స్టాక్ మార్కెట్లు నష్టాలతో ప్రారంభం అయిన దేశీయ మార్కెట్లు**

ముంబయి :

అంతర్జాతీయ పరిస్థితుల అనిశ్చితి, ముఖ్యంగా పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం ట్రేడింగ్‌లో కీలక సూచీలు క్షీణించాయి. ఉదయం 9:24 గంటల సమయానికి సెన్సెక్స్ సుమారు 529 పాయింట్లు పడిపోయి 73,576 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 155 పాయింట్లు నష్టపోయి 22,813 వద్ద కొనసాగింది. ప్రారంభ దశలో సెన్సెక్స్ 700 పాయింట్లకు పైగా పడిపోవడం గమనార్హం. నిఫ్టీ సూచీలో హిందాల్కో, ఓఎన్‌జీసీ, విప్రో, కోల్ ఇండియా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభాల్లో నిలిచాయి. మరోవైపు ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఎటర్నల్, ఐషర్ మోటార్స్, ఎంఅండఎం షేర్లు నష్టాలను చవిచూశాయి. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువు ముగియడానికి సమయం దగ్గర పడుతుండటంతో గ్లోబల్ మార్కెట్లలో ఉద్రిక్తత నెలకొంది. హర్మూజ్ జలసంధి అంశంపై పరిస్థితులు ఎలాంటి మలుపు తిరుగుతాయోనన్న అనిశ్చితి పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ప్రభావంతో ముడి చమురు ధరలు పెరుగుతూ బ్యారెల్‌కు 110 డాలర్లకు పైగా కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో రూపాయి విలువ కూడా బలహీనపడి డాలర్‌తో పోలిస్తే 93.07 వద్ద ట్రేడవుతోంది. మొత్తంగా, గ్లోబల్ టెన్షన్స్, చమురు ధరల పెరుగుదల దేశీయ మార్కెట్లపై ఒత్తిడిని పెంచుతున్నాయి. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో లాభాలను ఆర్జించిన దేశీయ సూచీలు మంగళవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. సోమవారం విదేశీ మదుపర్లు రూ. 8 వేల కోట్లకు పైగా విలువైన షేర్లు అమ్మేశారు. అలాగే హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన గడువు సమీపిస్తున్న వేళ పశ్చిమాసియా యుద్ధం ఏ క్షణాన ఏ మలుపు తీసుకుంటుందోననే ఆందోళన నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తమయ్యారు. ఈ ఆందోళన కారణంగా అంతర్జాతీయ మార్కెట్లు కూడా నష్టాల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో కదలాడుతున్నాయి. మంగళవారం ఉదయం దాదాపు 400 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరో 500 పాయింట్లు కోల్పోయింది. ఆ తర్వాత కాస్త కోలుకుంది. ప్రస్తుతం ఉదయం 10:50 గంటల సమయంలో సెన్సెక్స్ 354 పాయింట్ల నష్టంతో 73,752 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా నష్టాల బాటలోనే సాగుతోంది.సెన్సెక్స్, నిఫ్టీలో వేదాంత, హిందోల్కా, ప్రెస్టేజ్ ఎస్టేట్, విప్రో, ఎంఫసిస్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి. జుబిలెంట్ ఫుడ్స్, ఫోర్స్ మోటార్స్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, పీజీ ఎలక్ట్రోప్లాస్ట్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 266 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 563 పాయింట్ల నష్టంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 92.93గా ఉంది.



# వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

## వేడి ఎక్కువైతే డీహైడ్రేషన్

**వేసవి కాలంలో ప్రపంచవ్యాప్తంగా వడగాలుల తీవ్రత పెరుగుతోంది. వరుసగా కొన్ని రోజులు అధిక ఉష్ణోగ్రతలు కొనసాగితే, శరీరం తన అంతర్గత ఉష్ణోగ్రతను సమతుల్యం చేసుకోవడానికి మరింత కష్టపడాల్సి వస్తుంది. దీర్ఘకాలం వేడి ప్రభావానికి గురైతే ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఎక్కువ ప్రమాదంలో ఉంటారు.**



2025లో వెలువడిన పరిశోధనలు వడగాలులు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ప్రమాదాన్ని చూపిస్తున్నాయి. ముఖ్యంగా వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తీవ్రమైన పరిస్థితుల్లో మరణాలను 33 శాతం వరకు తగ్గించడానికి ప్రత్యేక చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. వడగాలుల సమయంలో శరీరంలో ఏం జరుగుతుందో తెలుసుకోవడం చాలా ముఖ్యం. సాధారణంగా శరీరం సుమారు 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను నిలుపుకుంటుంది. కానీ వేడి ఎక్కువగా ఉన్నప్పుడు ఈ సమతుల్యతను కాపాడుకోవడం కష్టమవుతుంది.

శరీరం చల్లబడటానికి ప్రధానంగా చెమట ద్వారా, చర్మానికి రక్తప్రసరణ పెంచడం ద్వారా పని చేస్తుంది. చెమట గ్రంథులు నీరు, లవణాలు విడుదల చేస్తాయి. ఈ చెమట ఆవిరైపోయే సమయంలో శరీరంలోని వేడి బయటకు వెళ్లిపోతుంది. అలాగే చర్మానికి దగ్గరగా ఉన్న రక్తనాళాలు విస్తరించి ఎక్కువ రక్తాన్ని పంపుతాయి. దీంతో వేడి బయటకు వెళ్ళే ప్రక్రియ వేగవంతమవుతుంది. ఈ రెండు ప్రక్రియలు కలిసి శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తాయి. అయితే ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువగా ఉన్నప్పుడు లేదా గాలి తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ సహజ శీతలీకరణ ప్రక్రియలు సమర్థవంతంగా పనిచేయవు. దీర్ఘకాలం వేడి ప్రభావం వల్ల డీహైడ్రేషన్ ప్రమాదం పెరుగుతుంది. చెమట ద్వారా శరీరం నీటితో పాటు ఎలక్ట్రోలైట్స్‌ను కోల్పోతుంది. తగినంత ద్రవాలు తీసుకోకపోతే అలసట, తల తిరగడం, తలనొప్పి, మూత్రం తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన డీహైడ్రేషన్ రక్తపోటు, రక్తప్రసరణపై ప్రభావం చూపి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది.

శరీరం ఉష్ణోగ్రతను నియంత్రించలేకపోతే హీట్ ఎగ్జాషన్ అనే పరిస్థితి ఏర్పడుతుంది. అధిక చెమట, బలహీనత, వాంతులు, కండరాల నొప్పులు, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ దశలో చర్మం చల్లగా, తడిగా అనిపించినప్పటికీ శరీరం లోపల వేడి ఎక్కువగా ఉంటుంది. సరైన చికిత్స లేకపోతే ఇది మరింత ప్రమాదకర స్థితికి దారితీస్తుంది. వడగాలుల సమయంలో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి వడదెబ్బ. ఈ సమయంలో శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌కి పైగా పెరుగుతుంది. గందరగోళం, వేగంగా గుండె కొట్టుకోవడం, పొడిగా వేడిగా ఉండే చర్మం, అపస్మారక స్థితిలోకి వెళ్లడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది అత్యవసర వైద్య పరిస్థితి. దీనికి వెంటనే చికిత్స అవసరం అని వైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బ వల్ల మెదడు, గుండె, కిడ్నీలు వంటి ముఖ్య అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. అధిక వేడి గుండెపై కూడా ఒత్తిడిని పెంచుతుంది. శరీరాన్ని చల్లబరచడానికి గుండె ఎక్కువగా పని చేయాల్సి వస్తుంది. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి ఇది ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. అంతేకాకుండా వడదెబ్బ కారణంగా కిడ్నీలు కూడా ప్రభావితమవుతాయి. డీహైడ్రేషన్, రక్తప్రవాహం తగ్గిపోవడం వల్ల కిడ్నీల పనితీరు దెబ్బతింటుంది. రాత్రిపూట అధిక ఉష్ణోగ్రతల వల్ల నిద్రలో అంతరాయం కలుగుతుంది. దీని వల్ల చిరాకు, అలసట, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు వస్తాయి. దీర్ఘకాలిక వేడి మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపి ఒత్తిడి, మూడ్ మార్పులకు కారణమవుతుంది. వడగాలుల కారణంగా ఇలా మొత్తం శరీరం అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని వైద్యులు తెలియజేస్తున్నారు.

### వడగాలుల నుంచి రక్షణ అవసరం..

కనుక వడగాలుల సమయంలో రక్షణ కోసం సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. దాహం లేకపోయినా తరచూ నీరు తాగాలి. తేలికపాటి, సడలించిన దుస్తులు ధరించాలి. మధ్యాహ్నం వేడి ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లడం నివారించాలి. ఫ్యాన్లు, ఏసీ, చల్లని ప్రదేశాలు ఉపయోగించాలి. చల్లని స్నానాలు కూడా శరీరాన్ని చల్లబరుస్తాయి. పిల్లలు, వృద్ధులు, పెంపుడు జంతువులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. వీరు వేడి ప్రభావానికి త్వరగా గురవుతారు. హీట్‌వేవ్‌లు శరీర ఉష్ణోగ్రత నియంత్రణను ప్రభావితం చేసి డీహైడ్రేషన్, హీట్ ఎగ్జాషన్, హీట్ స్ట్రోక్ వంటి ప్రమాదాలకు దారితీస్తాయి. కనుక జాగ్రత్తగా ఉండడం చాలా అవసరం. వేడి ప్రభావాన్ని అర్థం చేసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్యలను నివారించవచ్చు. తీవ్రమైన వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని వైద్యులు చెబుతున్నారు.





## షుగర్ క్రేవింగ్స్‌ను నియంత్రించడానికి
# సులభమైన మార్గాలు

చక్కెర తినాలనే కోరిక (షుగర్ క్రేవింగ్స్) చాలా మందిలో సాధారణంగా కనిపించే సమస్య. అయితే ఈ కోరికలను అదుపులో పెట్టుకోకుండా తరచుగా తీపి పదార్థాలు తీసుకుంటే, ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో పోషకాహార నిపుణులు షుగర్ క్రేవింగ్స్‌ను నియంత్రించడానికి సులభమైన మార్గాలను సూచించారు.

ముఖ్యంగా క్రోమియం అనే ఖనిజం అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవాలని నిపుణులు తెలియజేస్తున్నారు. క్రోమియం శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచడంతో పాటు, ఆకలి, తీపి పదార్థాలపై కోరికలను తగ్గించడంలో సహాయపడుతుంది. క్రోమియం పికోలినేట్ అనే రూపంలో ఈ ఖనిజం సప్లిమెంట్లలో ఎక్కువగా లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇది ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో ఉపయోగపడుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**వీటిని తీసుకోవాలి..**

క్రోమియం అధికంగా ఉండే ఆహారాలలో బ్రోకలీ ముఖ్యమైనది. ఇది పోషకాలు సమృద్ధిగా ఉండే కూరగాయగా మాత్రమే కాకుండా, రోజువారీ క్రోమియం అవసరాన్ని కూడా కొంతవరకు తీర్చగలదు. అలాగే దాల్చిన చెక్క (సినమన్) కూడా సహజంగా క్రోమియం అందించే పదార్థంగా భావించబడుతుంది. ఇది రుచిని పెంచడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. బెర్రీలు కూడా క్రోమియంకు మంచి వనరులుగా పరిగణించబడుతున్నాయి. బ్లూబెర్రీలు, స్ట్రాబెర్రీలు వంటి పండ్లు తీపి రుచితో పాటు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. ఈ ఆహారాలను రోజువారీ డైట్‌లో చేర్చడం ద్వారా శరీరానికి సహజంగా క్రోమియం అందించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే ఏ ఆహారం అయినా మితంగా తీసుకోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. సమతుల్య ఆహారం పాటించడం ద్వారా మాత్రమే షుగర్ క్రేవింగ్స్‌ను నియంత్రించవచ్చు. ఒకే పదార్థంపై ఆధారపడకుండా వివిధ రకాల పోషకాలు ఉన్న ఆహారాలను తీసుకోవడం అవసరం.

**షుగర్ క్రేవింగ్స్‌ను తగ్గించుకోవచ్చు..**

ఇంకా ముఖ్యమైన విషయం ఏమిటంటే టైప్–2 డయాబెటిస్ ఉన్నవారిలో క్రోమియం స్థాయిలు తక్కువగా ఉండే అవకాశం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. ఇన్సులిన్ రెసిస్టెన్స్ వంటి సమస్యలతో కూడిన మెటబాలిక్ సిండ్రోమ్‌లో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది. వయస్సు పెరుగుతున్న కొద్దీ క్రోమియం స్థాయిలు తగ్గే అవకాశం ఉండటంతో, సరైన ఆహారంతో పాటు అవసరమైతే సప్లిమెంట్లు కూడా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. క్రోమియం ఉన్న ఆహారాలను రోజువారీ జీవనశైలిలో చేర్చడం ద్వారా షుగర్ క్రేవింగ్స్‌ను నియంత్రించడంతో పాటు, సమగ్ర ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.



## యోగాసనాలు... ఇవి గుండెకు ఎంతో మేలు

అధిక కొలెస్ట్రాల్‌ను వైద్యపరంగా హైపర్ కొలెస్ట్రోలేమియా అని పిలుస్తారు. ఇది నియంత్రణలో లేకపోతే గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. సమతుల్య ఆహారం, క్రమమైన వ్యాయామంతో పాటు యోగాను కూడా రోజువారీ జీవితంలో చేర్చుకోవడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు. యూరోపియన్ జర్నల్ ఆఫ్ ప్రివెంటివ్ కార్డియాలజీలో ప్రచురితమైన సమీక్షా అధ్యయనం ప్రకారం యోగా సాధన చేయడం వల్ల చెడుకొలెస్ట్రాల్, మంచి కొలెస్ట్రాల్, రక్తపోటు స్థాయిలు మెరుగుపడినట్లు వెల్లడైంది.

**భుజంగాసనం, అర్ధ మత్స్యేంద్రాసనం..**

కొన్ని యోగా ఆసనాలు రక్తప్రసరణను మెరుగుపరచడం, జీర్ణక్రియను ఉత్తేజించడం, మెటబాలిక్ ఆరోగ్యాన్ని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. కనుక కొలెస్ట్రాల్‌ను సహజంగా నియంత్రించడంలో ఉపయోగపడే ఆరు సులభమైన యోగా ఆసనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. భుజంగాసనం (కోబ్రా పోజ్) న్యూరో ఎండోక్రైన్ వ్యవస్థపై ప్రభావం చూపి గ్లూకోజ్, లిపిడ్ మెటాబాలిజాన్ని మెరుగుపరచవచ్చని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ యోగా అధ్యయనం సూచిస్తోంది. ఈ ఆసనాన్ని చేయాలంటే పొట్టపై పడుకుని, చేతులను భుజాల దగ్గర ఉంచాలి. మెల్లగా ఛాతిని పైకి ఎత్తుతూ, మోచేతులను కొంచెం వంచి భుజాలను రిలాక్స్‌గా ఉంచాలి. కొన్ని శ్వాసల పాటు ఈ స్థితిలో ఉండి తిరిగి ప్రారంభ స్థితికి రావాలి. ఈ ఆసనం రక్తప్రసరణను మెరుగుపరచి గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. అర్ధ మత్స్యేంద్రాసనం కూర్చుని చేసే మలుపు ఆసనం. ఇది పొట్టలోని అవయవాలను మసాజ్ చేస్తూ జీర్ణక్రియను, మెటబాలిజాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కాళ్లను చాపి కూర్చుని ఒక కాలును వంచి ఎదురు తొడ బయట ఉంచాలి. తరువాత శరీరాన్ని వంచిన కాలి వైపు తిప్పుతూ వెన్నును నిటారుగా ఉంచాలి. దీన్ని క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల అంతర్గత అవయవాల పనితీరు మెరుగుపడుతుంది.




## నాలుగోరోజూ
# లాభాల్లో మార్కెట్లు
### 23 వేల ఎగువకు నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులతో ఉదయం ఓ దశలో సెన్సెక్స్ 800 పాయింట్లు నష్టపోయింది. మధ్యాహ్నం తర్వాత సీన్ మారింది. క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన మార్కెట్ సూచీలూ రాణించాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. సెన్సెక్స్ ఉదయం 73,734.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,106.85) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 73,282.41 వద్ద కనిష్ఠాన్ని తాకింది. తర్వాత పుంజుకొని 509.73 పాయింట్ల లాభంతో 74,616.58 వద్ద ముగిసింది. నిఫ్టీ 155.40 పాయింట్ల లాభంతో 23,123.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా స్టాక్స్ లాభపడ్డాయి. ఇండిగో, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, ట్రెంట్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 110 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4663 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పీ, జపాన్ నిక్కీ, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ రాణించాయి. యూరోపియన్ మార్కెట్‌లు కూడా లాభాల్లో ప్రారంభమయ్యాయి.



# ఎయిరిండియా సీఈఓ విల్సన్ రాజీనామా..!

టాటా గ్రూప్‌నకు చెందిన దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ రాజీనామా చేశారు. మరో ఏడాది పదవీ కాలం ఉండగానే తన బాధ్యతల నుంచి వైదొలిగారు. ఆయన రాజీనామాను ఎయిరిండియా ధ్రువీకరించింది. విల్సన్‌పై టాటా గ్రూప్ పెద్దలు అసంతృప్తిగా ఉన్నట్లు ఇటీవల వార్తలు వచ్చిన వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. న్యూజిలాండ్‌కు చెందిన క్యాంప్‌బెల్ విల్సన్ 2022 జులైలో ఎయిరిండియాలో చేరారు. ఆయన పదవీకాలం 2027 జూన్‌తో ముగియనుంది. ఆయన నేతృత్వంలోనే ఎయిరిండియాలో విస్తారా విలీనమైంది. అయితే, సంస్థ సేవల్లో నాణ్యత, సమయపాలనలో పెద్దగా మెరుగుదల కనిపించలేదు. దీనికి తోడు గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర ప్రమాదంతో విల్సన్ నాయకత్వంపై వ్యతిరేకత మొదలైంది. ఆ సమయంలో ప్రభుత్వ అధికారులు కూడా విల్సన్‌ను పక్కనపెట్టి నేరుగా టాటా గ్రూప్ పెద్దలతో మాట్లాడటం చర్చకు దారితీసింది. దీంతో ఆయనకు కంపెనీ ఉద్వాసన పలకనున్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.




**ఐటీలో మూలాల నుంచే ప్రక్షాళన**

ఈ క్రమంలోనే ఎయిరిండియా సీఈవో పదవి కోసం టాటా గ్రూప్ కొత్త వ్యక్తిని అన్వేషిస్తున్నట్లు ఈ ఏడాది మార్చిలో కథనాలు వెలువడ్డాయి. అమెరికా, యూకేకు చెందిన రెండు ప్రముఖ విమానయాన సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లతో గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మాట్లాడినట్లు వాటి సారాంశం. ఈనేపథ్యంలోనే తాజాగా విల్సన్ తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. మరోవైపు, ఎయిరిండియా అనుబంధ సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ సింగ్ కూడా ఇటీవలే పదవి నుంచి దిగిపోయారు.

**ఇదే సరైన సమయం: విల్సన్**

ఎయిరిండియాకు రాజీనామాపై విల్సన్ స్పందించారు. ఈ మేరకు ఉద్యోగులకు లేఖ రాశారు. ఎయిరిండియా తదుపరి దశ అభివృద్ధి కోసం బాధ్యతలను మరొకరికి అప్పగించడానికి ఇదే 'సరైన సమయం' అని ఆయన పేర్కొన్నారు. ఆరు నెలల పాటు ఆయన నోటీసు పీరియడ్‌లో ఉంటారు. మరోవైపు కొత్త సీఈవోను ఎంపిక చేసేందుకు ఎయిరిండియా ఇప్పటికే ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. కొత్త వ్యక్తి బాధ్యతలు స్వీకరించే వరకు విల్సన్ తన పదవిలో కొనసాగుతారు. నాలుగేళ్ల పాటు సంస్థకు సేవలందించిన విల్సన్‌కు టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ కృతజ్ఞతలు తెలిపారు.

# వొడాఫోన్ ఐడియాకి బిగ్ రిలీఫ్
### ఏజీఆర్ బకాయిల లెక్కింపు గడువు పొడిగింపు

అప్పుల ఊబిలో కూరుకుపోయిన కూరుకుపోయిన టెలికాం దిగ్గజం వొడాఫోన్ ఐడియాకి కేంద్ర ప్రభుత్వం మరికొంత ఊరటనిచ్చింది. కంపెనీ చెల్లించాల్సిన AGR బకాయిల పునఃపరిశీలన గడువును టెలికాం శాఖ మరో మూడు నెలల పాటు పొడిగించింది. తాజా నిర్ణయంతో జూన్ 30 వరకు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2007 నుంచి 2019 మధ్య కాలానికి సంబంధించిన ఏజీఆర్ బకాయిలను తిరిగి లెక్కించేందుకు కేంద్రం గతంలోనే అనుమతించిన సంగతి తెలిసిందే. ఈ గడువు పొడిగింపు వల్ల కంపెనీకి తన పాత రికార్డులను సరిచూసుకునేందుకు మరింత సమయం దొరికినట్లయింది. ఈ బకాయిల లెక్కింపులో లైసెన్స్ ఫీజుల పునఃపరిశీలన ఇప్పటికే పూర్తయినట్లు సమాచారం.




## ఎంఎస్ఎంఈలను ఆదుకునేందుకు
# రూ.2.5 లక్షల కోట్లతో క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్

పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రభావితమైన రంగాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. వ్యాపారాలను, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలను ఆదుకునేందుకు రూ.2.5 లక్షల కోట్లతో క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్‌ను సిద్ధం చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ స్కీమ్ కింద బ్యాంకులు ఇచ్చే రుణాలకు ప్రభుత్వం హామీగా ఉంటుంది. ఒకవేళ వ్యాపారాలు నష్టపోయి అప్పు తీర్చలేని పరిస్థితి వస్తే.. ప్రభుత్వం 90 శాతం (గరిష్ఠంగా రూ.100 కోట్ల వరకు) గ్యారెంటీ ఇస్తుంది. ప్రభుత్వ అనుబంధ సంస్థ అయిన నేషనల్ క్రెడిట్ గ్యారెంటీ ట్రస్టీ కంపెనీ నుంచి ఈ గ్యారెంటీ లభిస్తుంది. ప్రభుత్వం రూ.17వేల నుంచి రూ.18 వేల కోట్లు మేర ఈ స్కీమ్ కింద వెచ్చించనుంది.

కొవిడ్–19 సమయంలో వివిధ రంగాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇదేరీతిన 2020లో ఓ ప్యాకేజీని ప్రకటించింది. ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌లో భాగంగా ఎంఎస్ఎంఈలు, ఇతర వ్యాపారులను ఆదుకునేందుకు ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ ను తీసుకొచ్చింది. దీనికింద అన్నిరంగాలకు 100 శాతం గ్యారెంటీతో రుణాలు అందించింది. ఈ పథకం కింద బ్యాంకులు లేదా ఆర్థికసంస్థలు ఇచ్చే రుణాలకు ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుంది. అప్పు తీసుకున్నవారు తిరిగి చెల్లించలేకపోతే, ప్రభుత్వం ఆ బాధ్యతను తీసుకుంటుంది. పూచీకత్తు లేకుండా తక్కువ వడ్డీకే రుణాలు అందించింది.



యుద్ధ ప్రభావిత రంగాలకు మద్దతు ఇస్తాం

దేశ ఆర్థికవ్యవస్థపై యుద్ధ ప్రభావం పడకుండా ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుంది. పెరిగిన చమురు ధరల ప్రభావం వినియోగదారుల మీద భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై రూ.10 మేర ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. డీజిల్‌పై లీటరుకు రూ.21.50, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌పై లీటరుకు రూ.29.50 చొప్పున ఎగుమతి సుంకం విధించింది. కీలక పెట్రో కెమికల్ ఉత్పత్తులకు దిగుమతి సుంకాన్ని మినహాయించింది. తాజాగా యుద్ధ ప్రభావిత రంగాలకు మద్దతు ఇచ్చేందుకు త్వరలో ఈ పథకాన్ని అధికారికంగా ప్రకటించనుంది. యుద్ధ ప్రభావిత రంగాలను ఆదుకుంటామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ప్రకటించారు.

# ప్రయాణికులకు ఎయిరిండియా షాక్
### ఇంధన సర్ ఛార్జీల పెంపు

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ మేఘాలు విమాన ప్రయాణికులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో విమాన ఇంధన ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో, టాటా గ్రూప్‌కు చెందిన ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తమ ఇంధన సర్‌ఛార్జీలను భారీగా సవరించాయి. గ్లోబల్ మార్కెట్‌లో జెట్ ఫ్యూయల్ ధర కేవలం ఒక నెలలోనే బ్యారెల్‌కు $99.40 నుండి $195.19 కి (సుమారు 100% వృద్ధి) పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని ఎయిర్ ఇండియా గ్రూప్ వెల్లడించింది. ఈ పెరిగిన చార్జీలు దేశీయంగా ఏప్రిల్ 8వ తేదీ ఉదయం 9:01 గంటల నుంచి, కొన్ని అంతర్జాతీయ మార్గాల్లో ఏప్రిల్ 10వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని సంస్థ ప్రకటించింది. ఇప్పటివరకు దేశీయ విమాన టికెట్లపై ఉన్న ఫ్లాట్ సర్‌ఛార్జీకి బదులుగా, ఇకపై ప్రయాణించే దూరాన్ని బట్టి అదనపు భారం పడనుంది. 500 కి.మీ లోపు ప్రయాణానికి ₹299, అదే 2,000 కి.మీ దాటితే గరిష్ఠంగా ₹899 వరకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అంతర్జాతీయంగా చూస్తే.. సార్క్ దేశాలకు వెళ్లే వారికి $24 (సుమారు ₹2,000), పశ్చిమాసియాకు $50 (సుమారు ₹4,200), ఆగ్నేయాసియాకు $100 (సుమారు ₹8,300) వరకు చార్జీలు పెరిగాయి. లాంగ్ హాల్ రూట్లయిన యూరప్, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియాకు వెళ్లే ప్రయాణికులకు గరిష్ఠంగా $280 (సుమారు ₹23,300) వరకు ఇంధన సర్‌ఛార్జీ భారం పడనుంది. వేసవి సెలవుల సమయంలో ప్రయాణాలను ప్లాన్ చేసుకునే వారికి ఈ నిర్ణయం గట్టి ఎదురుదెబ్బ గా మారింది.



## ఆస్పత్రి ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్



**కాప్రా, ఏప్రిల్ 7 (నినాదం) :** ఉప్పల్ నియోజవర్గం పరిధిలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంజూరైన నేపథ్యంలో ఆసుపత్రికి అనుకూలమైన స్థలాల పరిశీలనలో భాగంగా నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద సర్వే నంబర్ 84లో ఖాళీగా ఉన్న స్థలాన్ని పరిశీలించిన ఉప్పల్ మండల తహసిల్దార్ పూల్ సింగ్, మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం వేణుగోపాల్, మేనేజర్ రోహిత్, రెవిన్యూ అధికారులు, స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, తిగుళ్ల శ్రీనివాస్ గౌడ్, ఫైళ్ల ప్రవీణ్, అల్లాడి కృష్ణ యాదవ్, పద్మరెడ్డి, ఉస్మాన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**పటాన్చెరు, ఏప్రిల్ 07 (నినాదం):** పటాన్చెరు నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ గారు తన నివాసంలో స్వయంగా అందజేశారు. మొత్తం 18 మంది లబ్ధిదారులకు రూ. 7,29,000 మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం స్థానిక నాయకులు మరియు ప్రజల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్ గౌడ్ గారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి అవసరమైన కుటుంబాలకు, ముఖ్యంగా వైద్య అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సహాయం చేరేలా కృషి చేస్తామని, ప్రజల సంక్షేమం తమకు ముఖ్యమని ఆయన హామీ ఇచ్చారు. లబ్ధిదారులు తమకు అందిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

### అరెస్టులు చేయడంపై ఉన్న శ్రద్ధ

## హామీల అమలుపై ఏది?

**కొడంగల్‌లో బీఆర్ఎస్ నాయకుల అరెస్టు**





**కొడంగల్, ఏప్రిల్07 (నినాదం):** ప్రజల పక్షాన పోరాడుతున్న ప్రతిసారి బిఆర్ ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేస్తున్నారని,ముందస్తు అరెస్ట్ చేయడంలో ఉన్న శ్రద్ధ హామీలు అమలు చేయడం లో చూపడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిఆర్ ఎస్ నాయకులు ప్రశ్నించారు. పరిగి నియోజకవర్గ పరిధిలోని కాడ్లాపూర్ లో భూబాధితులు చేపట్టిన దీక్షకు తరలివెళ్తారనే నెపంతో తమను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ప్రజాసమస్యలపై ప్రశ్నించడం నేరమా?అంటూ మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలను అణిచి వేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అరెస్ట్ లు చేయడం ఆపి ఇచ్చిన హామీలను అమలు చేయడం పై శ్రద్ధ చూపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.బొంరాస్ పేట్ మండలంలో బిఆర్ ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కోట్ల యాదగిరి, మాజీ వైస్ ఎంపిపి శేరి నారాయణరెడ్డి, రమణ రెడ్డి, రవిగౌడ్,లక్ష్మణ్,కొడంగల్ మండలం లో మున్సిపల్ రెండో వార్డు మాజీ కౌన్సిలర్ ఆర్ మధుసూదన్ యాదవ్, తలారి మల్లేశం, గొల్ల బాలరాజు, రవి, దౌలతాబాద్ మండలం లో మాజీ జడ్పీటీసీ కోట్ల మైపాల్, భీం లు ,మైపాల్, పకిరప్ప లను ముందస్తు అరెస్ట్ చేసి మధ్యాహ్నం వదిలిపెట్టినట్లు తెలిపారు.

# అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే దిశగా కీలక చర్యలు

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**





**మల్కాజిగిరి, ఏప్రిల్ 7 (నినాదం):** మల్కాజ్గిరి నియోజకవర్గం అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే దిశగా కీలక చర్యలు చేపడుతున్నట్టు మల్కాజిగిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్, జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఐపీఎస్ లను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలపై కులంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ ముఖ్యంగా నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న భూకబ్జాలు, అభివృద్ధి పనులకు ఎదురవుతున్న ఆటంకాలు వంటి అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అధికారులకు దృష్టికి తీసుకువెళ్లిన ముఖ్యాంశాలు.... అల్వాల్‌లో ఫైర్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన 11 గుంటల స్థలంపై కోర్టు స్టే కారణంగా పనులు నిలిచిపోవడం, మల్కాజ్గిరి డివిజన్ విమల దేవి నగర్‌లో బావిని మూసివేసి అక్రమ నిర్మాణం చేపడుతున్న విషయం, చెరువుల పరిరక్షణ, ఆధునీకరణ పనులు కోర్టు స్టే కారణంగా నిలిచిపోవడం, బండ చెరువు పరిరక్షణ, ఆధునీకరణ పనులు, స్మశానవాటికల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, బాక్స్ డ్రైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలనీ, పార్కుల అభివృద్ధి, పరిరక్షణ, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవడం లాంటి అంశాలపై చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. అనంతరం ఈ అంశాలపై సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నిరుగొండ జగదీష్ గౌడ్, చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, మురుగేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్, ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్, రేగటి శివ కుమార్ గౌడ్, జె కె సాయి గౌడ్, సుమన్ గౌడ్, రవీందర్, ఇమ్రాన్ గౌస్, అరవింద్, శివ కుమార్, హేమంత్ పటేల్, బాబు రావు, రాజేష్ గౌడ్, అరుణ్ రావు, వెంకటేష్, భాస్కర్ రెడ్డి, అశోక్ మోహన్ రెడ్డి, సుజిత్ శ్రీనివాస్ తదితరులు, స్థానిక కాలనీ వాసులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో పీహెచ్.డీ. ప్రవేశాలు

**ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, మేనేజ్ మెంట్, ఫార్మసీ, హ్యుమానిటీస్, లాలో ఫుల్-టైమ్ కోర్సులు**

**పరిశ్రమ నిపుణులు, శాస్త్రవేత్తల కోసం ఎక్స్ ట్రామ్యూరల్ పీహెచ్.డీ. ప్రోగ్రామ్**

GITAM
DEEMED TO BE UNIVERSITY

**పటాన్చెరు, ఏప్రిల్ 07(నినాదం):** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాదు, బెంగళూరు, విశాఖపట్నంలో నెలకొని ఉన్న మూడు ప్రాంగణా లలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను పీహెచ్.డీ. ప్రోగ్రామ్ లలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోందని పరిశోధన, అభివృద్ధి డైరెక్టర్ ప్రొఫెసర్ రామగోపాల్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్ మెంట్, ఫార్మసీ, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, న్యాయశాస్త్రం (లా) వంటి విభిన్న విభాగాలలో ఫుల్-టైమ్ అభ్యర్థులకు ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పరిశ్రమ నిపుణులు, శాస్త్రవేత్తల కోసం రూపొందించిన ఎక్స్ ట్రామ్యూరల్ పీహెచ్.డీ. ప్రోగ్రామ్ -- ఇంజనీరింగ్, సైన్స్, ఫార్మసీ విభాగాలలో అందుబాటులో ఉందని ఆయన తెలియజేశారు. సంబంధిత మాస్టర్స్ డిగ్రీ (కనీసం 55 శాతం మార్కులు), కనీసం 75 శాతం మార్కులతో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ, లేదా ఎం.ఫిల్. అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేయడానికి అర్హులని ప్రొఫెసర్ రామగోపాల్ పేర్కొన్నారు. ఫలితాల కోసం ఎదురు చూస్తున్న చివరి ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గీతం రీసెర్చ్ అడ్మిషన్స్ టెస్ట్, దాని తరువాత జరిగే ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. UGC-NET, CSIR-NET, GATE, GPAT, ICAR, or DBT-JRF వంటి చెల్లుబాటయ్యే జాతీయ స్థాయి పరీక్ష స్కోర్లు ఉన్న అభ్యర్థులకు రాత పరీక్ష నుంచి మినహాయింపు ఉంటుందని, వారిని నేరుగా ఇంటర్వ్యూకు పిలుస్తామని ఆయన వివరించారు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ మే 11, 2026 అని ప్రొఫెసర్ రామగోపాల్ స్పష్టీకరించారు. ప్రవేశ పరీక్షలు మే 23న (ఆన్ లైన్ లో), మే 30న (ప్రత్యక్షంగా) జరుగుతాయని, ప్రోగ్రామ్ ఆగస్టు 24, 2026న ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఫుల్-టైమ్ పీహెచ్.డీ. పరిశోధకులకు మూడు సంవత్సరాల వరకు నెలకు రూ.33 వేల ఫెలోషిప్ తో పాటు, అధునాతన పరిశోధనా సౌకర్యాలు, సహకారాలు, అకడమిక్ మద్దతును గీతం అందిస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు గీతం అధికారిక పోర్టల్ https://researchadmissions.gitam.eduలో దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ సూచించారు. ఇతర వివరాల కోసం 0891-2866411 ను సంప్రదించాలని, లేదా phdsupport@gitam.eduకు ఈ-మెయిల్ చేయాలన్నారు.

## అంబేద్కర్ కూడలిలో ట్రాఫిక్ పోలీసును కేటాయించండి

**ఎస్పైకి వినతిపత్రం అందించిన బిఆర్ఎస్ నాయకులు**



**కొడంగల్, ఏప్రిల్07(నినాదం):** కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ట్రాఫిక్ పోలీసు ను లేదా కానిస్టేబుల్ ను కేటాయించాలని స్థానిక బిఆర్ ఎస్ నాయకులు ఎస్పై సత్యనారాయణ కు వినతిపత్రం అందజేశారు. కూడలి వెడల్పు తక్కువగా ఉందని,వాహనాలు వేగంగా వెళ్తున్నాయని దీంతో తరచుగా బస్టాండ్ సమీపంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయని,సోమవారం రోజు ఉదయం పాఠశాల కు వెళ్తున్న ఎల్ కేజి చదువుతున్న చిన్నారి అయేషా ను అయివేగం తో వస్తున్న లారీ ఢీ కొనడంతో పాప చనిపోయిందని, ఈ ఘటన స్థానికులను కలచివేసిందని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కూడలిలో ట్రాఫిక్ పోలీసు లేదా కానిస్టేబుల్ ను కేటాయిస్తే వాహనచోదకులు జాగ్రత్త పడతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ రెండో వార్డు మాజీ కౌన్సిలర్ ఆర్. మధుసూదన్ యాదవ్, తలారి మల్లేశం, గొల్ల బాలరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం






**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 7 (నినాదం):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో 33 వ రోజు సందర్భంగా ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జీడిమెట్ల సర్కిల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేసి పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ హెల్త్ కాంప్‌లో జీడిమెట్ల సర్కిల్ పారిశుద్ధ్య కార్మికులు, ఎంటోమోలోగి సిబ్బంది పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ మెగా వైద్య శిబిరం మంగళవారం ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రయం 3.00 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో 230 మంది పారిశుద్ధ్య కార్మికుల సిబ్బంది పాల్గొని ఉచిత మెగా వైద్య శిబిరంలో వైద్యులతో వైద్య పరీక్షలు చేయించుకొని కావాల్సిన సూచనలు సలహాలను పొందారు.

## అమరవీరుల స్తూపం స్థలం కోసం వినతిపత్రం అందజేత



**దుబ్బాక ఏప్రిల్ 7(నినాదం):** ఈ రోజు దుబ్బాక మున్సిపల్ కమిషనర్ రమేష్ చైర్మన్ , శ్రీరామ్ సునీత దుబ్బాక పట్టణంలో అమరవీరుల స్తూపం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ కీసరీ స్వామి , బాల్ రెడ్డి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కీసరీ స్వామి మాట్లాడుతూ, దుబ్బాక నియోజకవర్గం తెలంగాణ ఉద్యమానికి ఒక కీలక కేంద్రంగా నిలిచిందని తెలిపారు. ఉద్యమ సమయంలో అన్ని పార్టీలకు చెందిన యువకులు, అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడారని గుర్తుచేశారు. అలాంటి త్యాగాలను స్మరించుకునేందుకు దుబ్బాకలో అమరవీరుల స్తూపాన్ని రాజకీయాలకు అతీతంగా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అధికారులు త్వరితగతిన స్థలం కేటాయించాలని కోరారు. బాల్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ప్రాణత్యాగం చేసిన అమ రవీరుల స్మృతిని చిరస్థాయిగా నిలబెట్టడం మనందరి బాధ్యత అని అన్నారు. ముఖ్యంగా 1969 ఉద్యమం మరియు మలి తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళు లు అర్పించేందుకు దుబ్బాక పట్టణంలో ఒక స్మారక స్తూపం నిర్మాణం అత్యవసరం అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అమరవీరుల స్తూపం కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలని వినతి పత్రం ద్వారా కోరినట్లు తెలిపారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా పనిచేద్దాం

**సమ సమాజ స్థాపనలో యువత ముందుండాలి**

**ఏప్రిల్ 10న పూలే కాంస్య విగ్రహావిష్కరణ**

**జవహర్‌నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ**



**జవహర్‌నగర్, ఏప్రిల్ 7 (నినాదం):** మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా పనిచేసి సమ సమాజ స్థాపనలో జవహర్ నగర్ యువత ముందుండాలని, ఈనెల 10వ తేదీన జరిగే మహాత్మా జ్యోతిరావు పూలే కాంస్య విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి జవహర్ నగర్ నుండే కాక జిల్లా నుండి పెద్ద ఎత్తున యువత తరలిరావాలని జవహర్ నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ పేర్కొంది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో ఈనెల 10వ తేదీన సాయంత్రం 5 గంటలకు విగ్రహ దాత కాయిత రాజు యాదవ్ ఆధ్వర్యంలో, మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మహనీయుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రజలు మేధావులు, ప్రజాసంఘాల నేతలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో హాజరైనారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, భారతీయ సంఘసంస్కర్త, విద్యావేత్త ఆధునిక యుగంలో కుల నిర్మూలన ఉద్యమాలకు బీజం నాటిన సామాజిక విప్లవయోధుడు, సత్య శోదక్ సమాజ్ స్థాపకుడు, వ్యవస్థాపకుడు, ఇల్లాలు చదువు... ఇంటికి వెలుగు అనే సామాజిక భావనను పెంపొందించిన దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 10వ తేదీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు అంబేద్కర్ నగర్ లో కన్నుల పండుగగా జరుపుతున్నామని ఈ కార్యక్రమానికి సబ్బండ వర్గాల ప్రజలు, పెద్ద ఎత్తున తరలిరావాలని తద్వారా ఆ మహనీయుని ఆశయాల కనుగుణంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కమిటీ సభ్యులు జవహర్ నగర్ లోని ప్రముఖులకు, పోలీసు అధికారులకు, అధికారులకు, నాయకులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు మండల సురేందర్, మొగిలి పాక పరుశరాం, మాజీ మేయర్ మేకల కావ్య, కాంగ్రెస్ అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, సత్యం, ఎర్ర గుడ్ల వెంకటేశ్వర్లు, సామాజిక సేవకుడు బూడిద వెంకటేష్, సోమాచారి, తూ టి శ్రీనివాసులు, వెంకటాచారి, విగ్రహ దాత కాయిత రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..





**పార్టీ శ్రేణులంతా సమిష్టి కృషి, సమన్వయంతో పనిచేద్దాం**

**డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రుద్ర అశోక్**

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 7 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ లోని భూదేవిహిల్స్ లో డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రుద్ర అశోక్ ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మళ్ళీ రాబోయేది బి ఆర్ ఎస్ ప్రభుత్వం అని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా సమన్వయంతో, కలిసి కట్టుగా పని చేయాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. బి ఆర్ ఎస్ పార్టీ సూచనలు, హ్యాట్రిక్ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ విప్ కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షులు శంబిపూర్ రాజు, తాజా మాజీ కార్పొరేటర్ జగన్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీ పూర్వ వైభవానికి ప్రతి నాయకుడు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్టీ అభ్యున్నతి కొరకు కష్టపడ్డవారందరికీ సముచిత అవకాశాలు ఉంటాయని డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్ వివరించారు. ఈ కార్యక్రమములో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి మాజీ చైర్మన్ వేణు యాదవ్, భూదేవిహిల్స్ పార్టీ అధ్యక్షులు మల్లా చారి, సీనియర్ బీసీ సెల్ అధ్యక్షులు విటల్, ఎస్సి సెల్ అధ్యక్షులు దాసు, బి ఆర్ ఎస్ వి ప్రెసిడెంట్ దినేష్ సింగ్ సీనియర్ నాయకులు రామకృష్ణ, కె.వి రాజు,త్రివేణి, శ్రీను, అయోధ్య,నరేందర్ గౌడ్, మధుసూదన్ రావు,భాస్కర్ రెడ్డి, కళ్యాణ్ వడ్లమూడి,రాకేష్,శ్రీను నాయక్,రవి సాగర్,హర్షవర్ధన్ రెడ్డి,మహేష్ గౌడ్,మల్లికార్జున్, జలందర్ తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేత



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 7 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. మంగళవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు. అందులో భాగంగా లబ్ధిదారులు సూరారం కాలనీ వాసులు, ఎస్. అన్నపూర్ణ కు 45వేలు, గురుమూర్తి నగర్ వాసులు, మహమ్మద్ అజరుద్దీన్ కు 50వేలు, లాల్ బహదూర్ నగర్ వాసులు ,గెహ్లావుట్ ఘనశ్యామ్ కు 60వేలు, సుభాష్ నగర్ వాసులు, కర్రోలు భారతి కి రూ. 60వేలు, వెంకటేశ్వర కాలనీ వాసులు, బొంతి కుమారి కి రూ 60వేలు, క్రిషి కాలనీ వాసులు, ముక్కర్ల హరీష్ కు 37.5వేలు, షాపూర్ నగర్ వాసులు, గార్లస్ జ్యోతి కి రూ 60వేలు మంజూరి చేయించి కొలను హనుమంత రెడ్డి చేతుల మీదుగా మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హనుమంత రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు, మాజీ కార్పొరేటర్ పాల క్రిష్ణా, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, రషీద్, సంజీవరెడ్డి, బేకు శ్రీనివాస్, బైరి ప్రశాంత్ గౌడ్, కొలన్ జీవన్ రెడ్డి, బియ్యాని శివ, సంతోష్ ముదిరాజ్, సంపంగి వెంకటేష్, ఉస్మాన్ పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా షెడ్యూల్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ స్టేట్ జాయింట్ సెక్రటరీగా శ్రీనివాస్



**దుబ్బాక, ఏప్రిల్ .7 (నినాదం):** ఆల్ ఇండియా షెడ్యూల్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ స్టేట్ జాయింట్ సెక్రటరీగా గుర్రాల శ్రీనివాస్‌ను నియమించారు. ఈ నియామకాన్ని సంస్థ జాతీయ అధ్యక్షుడు ఎస్. రాజు ఉస్తాద్ మరియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వైద్యనాథ్ ఆదేశాల మేరకు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఆల్ ఇండియా షెడ్యూల్ క్యాస్ట్ లైక్ ప్రొడక్షన్ సొసైటీ అడ్వైజర్ బిట్ల వెంకటేశ్వర్లు, సమస్త ట్రెజరర్ కడమంతి ముత్తయ్య చేతుల మీదుగా గుర్రాల శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గుర్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ, హైదరాబాద్ రాజధాని లోని అంబేద్కర్ భవన్‌ను కేంద్రంగా తీసుకుని సంస్థ కార్యకలాపాలను విస్తరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ, రాజ్యాంగం కల్పించిన హక్కుల బలోపేతం, సామాజిక వివక్ష నిర్మూలన, సమానత్వ స్థాపన తమ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు అనేక అన్నగారిన ఉద్యమాల్లో పాల్గొని ఎస్సీ, ఎస్టీ అణగారిన వర్గాల కోసం పోరాటాలు సాగించామని గుర్తుచేశారు. భవిష్యత్తులో ఎస్సీ ఎస్టీ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సమాజంలో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తామని అన్నారు. అలాగే, ఎస్సీ సమాజంపై జరిగే అన్యాయాలు, అవమానాలు, దాడులను అరికట్టేందుకు కఠినచర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల సమర్థ అమలుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల విద్య, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ పదవి బాధ్యతలు నియమించిన పెద్దలకు షెడ్యూల్ క్యాస్ట్ రైట్ ప్రొడక్షన్ సంస్థ ప్రతినిధులందరికీ పేరుపేరునా అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మల్లెపూల శ్రీకాంత్ యాదవ్‌కు శుభాకాంక్షల వెల్లువ



**జవహర్ నగర్, ఏప్రిల్ 7 (నినాదం):** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా ఇటీవలే నూతనంగా ఎన్నికైన మల్లెపూల శ్రీకాంత్ యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీ. కాలేష మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం శ్రీకాంత్ యాదవ్ నివాసానికి వెళ్లిన కాలేష, ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా టీ. కాలేష మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి శ్రీకాంత్ యాదవ్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. జిల్లా అధికార ప్రతినిధిగా ఆయన నియామకం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని, ప్రజా సమస్యలపై గళం విప్పడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తమపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్టానానికి శ్రీకాంత్ యాదవ్ కృతజ్ఞతలు తెలుపుతూ, అందరి సహకారంతో పార్టీ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు.

# కరీంనగర్‌లో సగరులకు భూమి

## మంత్రి పొన్నంకి వినతి..



**జమ్మికుంట, ఏప్రిల్ 7 (నినాదం):** కరీంనగర్ జిల్లా కేంద్రంలో సగరుల కోసం భూమి కేటాయించాలని కోరుతూ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, జిల్లా అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాసు సగర కోరారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్‌కు వారు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సగరుల సమస్యలు, వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన విషయాలపై మంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం స్పందిస్తూ కరీంనగర్ కలెక్టర్‌కు సిఫార్సు చేశారు. అనంతరం పొన్నం మాట్లాడుతూ సగరుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

## అభ్యర్థిత్వంపై వివాదం

# ఎన్నికల రంగంలో కలకలం

**ఫోర్జరీ ఆరోపణలతో చట్టపరమైన పోరాటం వేడెక్కింది**

**రామగుండం 11వ డివిజన్‌లో సంచలన పరిణామం**

**గోదావరిఖని ఏప్రిల్ 07 (నినాదం):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. కారంగుల వాణి (రమ్య) ఏఐఎఫ్ బి పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థిత్వంపై తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఫోర్జరీ పత్రాలపై తీవ్ర ఆరోపణలు**

అభ్యర్థి నకిలీ పత్రాలు ఉపయోగించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా,నకిలీ ఆధార్ కార్డుబ్యాంక్ ఖాతా వివరాల్లో తారుమారులుకుల ధృవీకరణ పత్రంలో అసత్య సమాచారంస్టడీ సర్టిఫికేట్‌లో మార్పులు అఫిడవిట్‌లో తప్పుడు వివరాలుఈ ఆరోపణలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి. కోర్టుల్లో కేసులు -- చట్టపరమైన పోరాటం ప్రారంభం,ఈ అంశంపై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డ మాజీ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని ప్రకాష్ నేతృత్వంలో న్యాయపోరాటం కొనసాగుతోంది.

**ప్రస్తుతం కేసులు:**

తెలంగాణ హైకోర్టు (W.P. No.10304/ 2026)పెద్దపల్లి జిల్లా కోర్టు (EP/OP No.1/ 2026)హైకోర్టు ఇప్పటికే ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యత తీసుకొచ్చింది.

**అనర్హత డిమాండ్..కఠిన చర్యలపై ఒత్తిడి**

ఫిర్యాదుదారులు అభ్యర్థిని వెంటనే అనర్హురాలిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే:సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఫోర్జరీ కేసులపై క్రిమినల్ విచారణఅని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రాజకీయంగా తీవ్ర ప్రభావం -- ముందున్న పరిణామాలపై ఉత్కంఠ ఈ వివాదం రామగుండం రాజకీయాల్లో పెద్ద మార్పులకు దారి తీసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కోర్టు తుది తీర్పు ఎలా ఉంటుందన్నదానిపై అందరి దృష్టి నిలిచింది.

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

**జాబ్ మేళాలో 41 మంది విద్యార్థుల ఎంపిక**

**ప్రభుత్వ కళాశాల విద్యార్థుల హవా**




**జమ్మికుంట, ఏప్రిల్ 7 (నినాదం)** జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ పీజి కళాశాలలో జరిగిన మెగా జాబ్ మేళాలో 41 మంది విద్యార్థులు పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. రమేష్, టి ఎస్ కే సి కో- ఆర్డినేటర్ కె. ఉమాకిరణ్ తెలిపారు. కళాశాలలోని పి ఎస్ కే సి ఆధ్వర్యంలో, ప్రిన్సిపాల్ అధ్యక్షతన మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించడం జరిగింది. రాష్ట్రంలోని 12 కంపెనీలు ప్రతినిధులు విచ్చేశారు. జాబ్ మేళాకు 150 మంది విద్యార్థులు ఇంటర్వ్యూ లకు హాజరయ్యారు. వారిలో 41 మంది విద్యార్థులు పలు రకాల ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో 40 మంది విద్యార్థులు పలు ఉద్యోగాల శిక్షణలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైనా వారిలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ గా ఎ.దిలీప్ అనే విద్యార్థితో పాటు మరికొందరు విద్యార్థులు రూ. 2 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అలాగే ప్రొడక్షన్ మేనేజర్ గా రమేష్ అనే విద్యార్థితో పాటు మరికొందరు రూ. 1.80 లక్ష ల ప్యాకేజీకి ఎంపికైయ్యారు. కాగా రూ.1.60 లక్షల నుండి రూ.1.80 లక్షల వరకు వివిధ ప్యాకేజీలలో వివిధ కంపెనీలలో పలు హోదాలలో విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈ మేరకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయా కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా మెరుగైనా విద్యార్థులు ఈ స్థాయిలో పలు ఉద్యోగాలకు ఎంపిక కావడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. ఇలాంటి జాబ్ మేళాను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించడం అభినందనీయమని వారు కళాశాల ప్రిన్సిపాలను, అధ్యాపకులను అభినందించారు. ఈ జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చదవడం చాల అదృష్టంగా భావించాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలు చేసుకుంటూనే ఉన్నత విద్యను అభ్యసించి మరింత ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైనా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.ఎస్.ఓదెలు కుమార్, డా కె.రాజేంద్రం, డా. కె. గణేష్, డా. మాధవి, కిరణ్ కుమార్, డా. ఎంబాడి రవి, పి . శ్రీనివాస్ రెడ్డి, ఎల్. రవీందర్, డా. పి. సుష్మ, డా. పి. రవిప్రకాశ్ రావు, ఎన్. మమత, డా. శ్రీనివాస్, శ్రీకాంత్, రమేష్, ప్రశాంత్, సాయికుమార్, అనూష, అరుణ్ రాజ్, డా.పి. స్వప్న, దీనా, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# ప్రశాంతంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

**విజయవంతం చేసిన అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు**

**ఆలయ చైర్మెన్ ఇంగిలే రామారావు**



**జమ్మికుంట, ఏప్రిల్ 7 (నినాదం):** అపర పద్ధతిగా పేరుపొందిన ఇల్లంతకుంట లోని శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు విజయవంతం కావడానికి సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు వ్యాపారస్తులకు అధికారులకు ఆలయ కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపిన ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు. భద్రాచలం తర్వాత అతిపెద్ద సీతారామచంద్ర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల సందర్భంగా దాదాపు 13 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజలకు భక్తులకు సహకరించిన జమ్మికుంట కాటన్ మిల్లర్స్, పారాబోయిల్డ్ రైస్ మిల్లర్స్, రా రైస్ మిల్లర్స్ అన్నదాన కార్యక్రమం,అన్ని శాఖల అధికారులకు జిల్లా యంత్రాంగానికి,పోలీస్ శాఖ, ఆర్ అండ్ బి, ఆరోగ్యశాఖ ఆర్టీసీ యాజమాన్యం, రెవెన్యూ శాఖ 108,మున్సిపాలిటీ అధికారులు, పారిశుద్ధ కార్మికులు, 18గ్రామాల గ్రామపంచాయతీ సిబ్బంది, దేవస్థానం అధికారులు,అర్చకులు, సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులందరికి కృతజ్ఞతలు అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించిన పోలీస్ వారికి వారి కుటుంబానికి ఆ సీతారామచంద్ర స్వామి దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా మా పాలకవర్గం తరఫున కోరుకుంటున్నాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు ధర్మకర్తలు గోలి కిరణ్, గోడిశాల పరమేష్, కారింగుల రాజేందర్, సింగిరెడ్డి గోపాల్, కురిమిండ్ల చిరంజీవి,ఎడ్ల కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐదు శాతం రాయితీతో ఆస్తి పన్ను చెల్లింపు

-పట్టణ ప్రజలకు ఆదర్శంగా చైర్పర్సన్



**జమ్మికుంట, ఏప్రిల్ 7 (నినాదం):** హుజురాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2026- 27 ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తుగా హుజురాబాద్ పురపాలక చైర్ పర్సన్ రొంటాల సుహాసిని వారి గృహముకు సంబంధించిన ఆస్తి పనులపై ఐదు శాతం రాయితీతో డబ్బులు చెల్లించి పట్టణ ప్రజలకు ఆదర్శంగా నిలిచింది. హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఏప్రిల్ 1 నుండి 30వ తేదీ వరకు ముందస్తుగా గృహ యజమానులు ఆస్తి పన్ను చెల్లించినట్లయితే ఐదు శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని హుజురాబాద్ పట్టణంలోని ప్రజలందరూ వినియోగించుకోవాలని చైర్పర్సన్ సుహాసిని కోరారు. ముందస్తుగా ఆస్తి పనులు చెల్లించడం వల్ల ఐదు శాతం రాయితీతో తక్కువ డబ్బులు చెల్లించడమే కాకుండా మున్సిపాలిటీ కి ఆదాయం చేకూరడం వల్ల అభివృద్ధి పనులు కూడా సకాలంలో పూర్తి చేయడం జరుగుతుందని పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మున్సిపాలిటీ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ అహ్మద్ సయ్యద్, మేనేజర్ భూపాల్ రెడ్డి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రమేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం కూలినా కదలని

## సంబంధిత అధికారులు

-మెట్‌పల్లి రోడ్లు అస్తవ్యస్తం




**మెట్‌పల్లి, ఏప్రిల్ 7: ( నినాదం):** పట్టణంలో సమస్యలు పెరుగుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంగడి బజార్ నుంచి వాసవి గార్డెన్‌కు వెళ్లే మార్గంలో రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో శిలాఫలకం కూలిపోయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

**పనిచేయని సీసీ కెమెరాలు...**

పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, వాటి నిర్వహణలో విఫలమవ్వడం సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికే నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. ఘటనపై విచారణలో కూడా ఆలస్యం జరుగుతుండటంతో దోషి వాహనం ఇంకా గుర్తు పట్టలేకపోతున్నారు.పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తా నుంచి గాజులపేట వరకు రహదారిపై చిరు వ్యాపారస్తుల ఆక్రమణలు విపరీతంగా పెరిగాయి. ఈ సమస్యను పరిష్కరించాల్సిన సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ట్రాఫిక్ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. స్కూల్ బస్సులు, అత్యవసర వాహనాలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.వెల్లుల్ల ఖాదీ స్థలంలో మార్కెట్ నిర్మించినప్పటికీ, వ్యాపారులను అక్కడికి తరలించడంలో అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. నియంత్రణ లేకపోవడంతో రోడ్లపైనే వ్యాపారం కొనసాగుతోంది. వాసవి కన్యాక పరమేశ్వరి దేవాలయం వద్ద ప్రతి సోమ, గురు, శని వారాల్లో రద్దీ ఎక్కువగా ఉండగా, ట్రాఫిక్ నిర్వహణలో కూడా ఎలాంటి చర్యలు కనిపించకపోవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. దేవాలయం ముందు సీసీ కెమెరాలు పనిచేయకపోవడం భద్రతపై సందేహాలు రేకెత్తిస్తోంది.ఇన్ని సమస్యలు కళ్లముందే ఉన్నప్పటికి సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల పట్టణ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని శిలాఫలకం ఘటనపై విచారణ, సీసీ కెమెరాల పునరుద్ధరణ, రోడ్డు ఆక్రమణల తొలగింపు, ట్రాఫిక్ నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




# డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా నిరసన దీక్ష





**అంబేద్కర్ విగ్రహానికి నివాళులు**

**డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ప్రజా పోరాటం ఉధృతి**

**నిరాహార దీక్షలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మాజీ ఎంపీ వినోద్ కుమార్**

**జమ్మికుంట, ఏప్రిల్ 7(నినాదం):** హుజురాబాద్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ప్రజా ఉద్యమం మరింత ఉధృతమైంది. మంగళవారం నిర్వహించిన 24 గంటల నిరాహార దీక్ష లో భాగంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అమరవీరులను స్మరించుకుని నిరాహార దీక్షలో కూర్చున్నారు. ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన ఈ నిరసనకు విశేష స్పందన లభించింది. పెద్ద ఎత్తున మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దీక్షలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన ప్రజలు, యువత, మహిళలు దీక్షా స్థలాన్ని నింపివేసి ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వినోద్ కుమార్ జేఏసీ కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడటమే కాకుండా భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ప్రజలపై అన్యాయం అని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేసే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రజల తరఫున చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ప్రజల ఐక్యతతో ఈ ఉద్యమం విజయవంతం అవుతుం దని, ప్రభుత్వం వెంటనే స్పందించి డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని రద్దు చేయాలని జేఏసీ నాయకులు కోరారు.మహిళలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను

## పరామర్శించిన మాజీ మంత్రి



**బుగ్గారం, ఏప్రిల్ 7,(నినాదం ):** బుగ్గారం మండలం వెల్గొండ గ్రామ మాజీ సర్పంచ్ గాదె తిరుపతి తండ్రి గాదె రాజయ్య మరియు బుగ్గారం బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు సరోజన కుమారుడు రెంటం సురేష్ అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకొని వారి ఇరువురి కుటుంబాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మంగళవారం నాడు పరామర్శించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట మాజీ డీసీఎంసీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి బుగ్గారం మండల నాయకులు తదితరులు ఉన్నారు.

## పోయిన పాస్ పోర్ట్ దొరికితే ఇవ్వండి

**మల్లాపూర్, ఏప్రిల్ 07 (నినాదం):** మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామనికి చెందిన మేడిపల్లి పనింద్ర గురేటికాపు తండ్రి: మేడిపల్లి నారాయణ రెడ్డి గురేటికాపు కట్లకుంట నుండి మెట్ పల్లి కి బైక్ పై వెళుతుండగా బ్యాగు పడిపోయింది. అందులో పాస్ పోర్ట్ (నం:ూాద451898) ఇతర విలువైన పత్రాలు ఉన్నాయని ఎవరికైనా దొరికినచో 9948466932 నంబర్ కి తెలుపగలరని కోరారు. దొరికిన పాస్ పోర్ట్ ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

# డంపింగ్ యార్డ్‌ను తరలించండి

**హుజురాబాద్ ప్రజల ఆవేదనను అర్థం చేసుకోండి..**

**మంత్రి తుమ్మల కు వినతి పత్రం ఇచ్చిన జేపసీ నాయకులు**

**సానుకూలంగా స్పందించా రన్న ఇన్చార్జి ప్రణవ్**



**జమ్మికుంట, ఏప్రిల్ 7 (నినాదం):** వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ద్వారా హుజురాబాద్ ప్రాంతం తీవ్రంగా నష్టపోతుందని,ప్రజల ఆరోగ్యమే కాకుండా సారవంతమైన నేల కలిగిన హుజూరాబాద్,సిర్సపల్లి ప్రాంతం కాలుష్య కోరల్లో చిక్కుకుంటదని హుజూ రాబాద్ డంప్ యార్డ్ జేఏసీ నాయకులు, హుజూరాబాద్ మున్సిపల్ పాలకవర్గం అన్నారు. మంగళవారం రోజున సెక్రటేరి యట్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చాంబర్ లో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు, పాలక వర్గం, మున్సిపల్ పరిధిలోని నాయకు లతో మంత్రిని కలిశారు.ఈ సందర్భంగా మంత్రికి వినతి పత్రం అందజేశారు.ఈ విషయమై ఇప్పటికే మున్సిపల్ పాలక వర్గం ఈ డంప్ యార్డును వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారని ఆ విషయాన్ని మంత్రికి వివరించారు.వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ వేరే చోటుకు తరలించాలని,ఈ ప్రాంత భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని సానుకూల ప్రకటన చేయాలని జేఏసి నాయకులు కోరగా సానుకూలంగా స్పందించిన మంత్రి ఇప్పటికే ఈ విషయంపై ప్రణవ్ నా దృష్టికి తీసుకువచ్చాడని తప్పకుండా ముఖ్యమంత్రితో మాట్లాడి కృషిచేస్తానని తెలిపారు.

సీతారాములసేవలో

# బల్మూరి వెంకట్

**ఎమ్మెల్సీకి అపర భద్రాద్రి ఫొటో అందజేసిన పాలకవర్గం**

**స్వామివారి సేవకు తన వంతు సహాయ సహకారాలు**



**జమ్మికుంట, ఏప్రిల్ 7 (నినాదం):** అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్న వేళ, స్వామివారి సేవలో భాగస్వామ్యులైన దాతలను దేవస్థానం ప్రత్యేకంగా సత్కరిస్తోంది. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలను సమర్పించి, తన అనుచరులతో కలిసి తలంబ్రాలు పంపించిన డాక్టర్ బల్మూర్ వెంకట్‌ను ఆలయ అధికారులు ఘనంగా సన్మానించారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన కళ్యాణోత్సవం, రథోత్సవం వంటి కార్యక్రమాలకు అవసరమైన పట్టు వస్త్రాలను సమకూర్చిన బల్మూర్ వెంకట్ సేవలను అర్చకులు, అధికారులు ప్రత్యేకంగా కొనియాడారు. అలాగే ఆయన అనుచరులు సమర్పించిన తలంబ్రాలు ఉత్సవాలకు మరింత శోభను తీసుకొచ్చాయని పేర్కొన్నారు.ఈ క్రమంలో తలంబ్రాల సమర్పణకు గాను దేవస్థానం తరఫున గుర్తింపుగా మెమెంటోను అందజేశారు. ఆలయ అర్చకులు స్వామివారి ఆశీర్వాదాలతో డాక్టర్ బల్మూర్ వెంకట్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో చింతల శ్యామ్ సుందర్ రెడ్డి బాబాజీ నాగరాజు, సింగిరెడ్డి రంజిత్ రెడ్డి, , అనిల్ రెడ్డి, కిషోర్ తదితరులు కలిసి స్వామివారి మెమెంటోను అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ, ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్రస్వామి సేవలో భాగస్వామ్యం కావడం తనకు గొప్ప అదృష్టమని అన్నారు. భవిష్యత్తులో కూడా దేవస్థానం కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. దేవస్థానం అధికారులు మాట్లాడుతూ, భక్తుల సహకారంతోనే బ్రహ్మోత్సవాలు మరింత వైభవంగా నిర్వహించగలుగుతున్నామని, సేవాభావంతో ముందుకు వస్తున్న దాతలను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

# ప్రభుత్వ ధాన్యం పక్కదారి

**రూ. 6.91 కోట్ల కుంభకోణం**

**నలుగురు మిల్లర్ల అరెస్ట్**



**కాగజ్ నగర్ ఏప్రిల్ 7(నినాదం):** ప్రభుత్వానికి అప్పగిం చాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ సీఎంఆర్ ను దుర్వినియోగం చేసి, కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సిర్పూర్-టి మండలం వెంకటరావుపేటలోని శ్రీ సాయి బాలాజీ అగ్రో టెక్ రైస్ మిల్ యజమానులపై సివిల్ సప్లైస్ అధికారుల ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. తెలంగాణ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం, సదరు మిల్లు 2023--24 రబీ సీజన్‌కు సంబంధించిన వడ్లను మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి బియ్యం రూపంలో తిరిగి ఇవ్వాల్సి ఉంది. అయితే యజమానులు సుమారు 1825.744 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అప్పగించకుండా కాలయాపన చేశారు. ఫైన్ మరియు వడ్డీతో కలిపి దీని విలువ సుమారు రూ. 6.91 కోట్లు 2702.797 మెట్రిక్ టన్నుల ధాన్యం గా అధికారులు నిర్ధారించారు పోలీసుల దర్యాప్తులో నిందితులు ఈ ప్రభుత్వ బియ్యాన్ని భాగ్యలక్ష్మి మరియు సువర్ణ రైస్ మిల్లుల ద్వారా కోళ్ళ దాణా కోసం మరియు ఇతర అవసరాలకు అక్రమంగా విక్రయించినట్లు తేలింది. ఈ విక్రయాల ద్వారా సుమారు రూ. 3.8 కోట్లు సంపాదించి, ఆ మొత్తాన్ని తమ వ్యక్తిగత అవసరాలకు మళ్లించినట్లు నిర్ధారణ అయ్యింది. అధికారులు వెల్లడించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో మిల్లు యజమానులు మరియు భాగస్వాములు రెనుకుంట్ల పద్మజ బుద్ద మాధురి రెనుకుంట్ల శివకుమార్ (పద్మజ భర్త)బుద్ద మనీష్ సివిల్ సప్లైస్ అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులను అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ భారీ కుంభకోణంలో ఇంకా ఎవరి పాత్రైనా ఉందా అనే కోణంలో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఇంకా పూర్తిగా విచారణ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

## జాతీయ స్థాయి రోయింగ్

# పోటీలకు జమ్మికుంట వాసి ఎంపిక

**జమ్మికుంట, ఏప్రిల్ 7 (నినాదం):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవపురం 15వ వార్డుకి చెందిన పాతకాల ప్రశాంత్ జాతీయ స్థాయి రోయింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఏప్రిల్ 8 నుండి 12 వరకు ఒడిశా రాష్ట్రంలోని కటక్ నగరంలో నిర్వహించనున్న ఫస్ట్ ఆల్ ఇండియా ఇండోర్ రోయింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున ఆయన పాల్గొననున్నారు.ప్రస్తుతం హైదరా బాద్‌లో ఎస్ పి ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రశాంత్ 2012 సంవత్సరం నుంచి అథ్లెటిక్స్‌లో పాల్గొంటూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించారు. క్రీడల్లో తన ప్రతిభను కొనసాగిస్తూ రోయింగ్‌లోనూ జాతీయ స్థాయికి ఎంపిక కావడం విశేషం.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, క్రీడాభిమానులు



ప్రశాంత్‌కు అభినందనలు తెలుపుతూ పోటీల్లో విజయం సాధించి తెలంగాణ రాష్ట్రానికి, స్వగ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## మాజీ మంత్రి హరీష్ రావు అరెస్ట్ హేయమైన చర్య



**జమ్మికుంట, ఏప్రిల్ 7 (నినాదం):** పరిగి రైతుల సమస్యలను తెలుసుకుని వారికి మద్దతు తెలిపేందుకు బయలుదేరిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ని పోలీసులు అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు రాపర్తి అఖిల్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. రైతుల సమస్యలను వినడానికి వెళ్తున్న హరీష్ రావుపార్టీ నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని అవమానపరచడమేనని అఖిల్ గౌడ్ అన్నారు. రైతుల పక్షాన నిలబడే నాయకులను అరెస్ట్ చేయడం ప్రభుత్వ అసహనానికి నిదర్శనమని మండిపడ్డారు. రైతులు కష్టాల్లో ఉన్న సమయంలో వారికి అండగా నిలబడాల్సిన ప్రభుత్వం, సమస్యలను లేవనెత్తే నాయకులను అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు.

# ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందేలా పని చేయాలి

**కలెక్టర్ కోయ శ్రీహర్ష**
**విద్య, ఆరోగ్యం,రెవెన్యూ సేవల్లో నాణ్యతపై ప్రత్యేక దృష్టి**
**పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి**
**విద్యార్థుల ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యత అంశం**
**జూలపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్**





**పెద్దపల్లి రూరల్,ఏప్రిల్7 (నినాదం) :** జూలపల్లి మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేలా పనిచేయాలని, జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జూలపల్లి మండలంలోని తెలుకుంట గ్రామం లోని కే.జీ.బీ.వీ పాఠశాల,కళాశాల, పెద్దాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్, జూలపల్లి తహశీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పి.హెచ్.సి.లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కే.జీ.బీ.వీ,లో విద్యార్థినులతో ముచ్చటించి,విద్యా బోధన,భోజన నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నాయా అని విచారించగా, ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు. పెద్దాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ లో వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వంట సిబ్బంది ఆరోగ్యకరమైన, పోషకాహారంతో కూడిన ఆహారం సిద్ధం చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని,విద్యార్థుల ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. జూలపల్లి తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. భూ భారతి దరఖాస్తులను సమయానికి డిస్పోజ్ చేయాలని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను స్లాట్ వారీగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు సేవలందించడంలో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జూలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓ.పీ వివరాలను పరిశీలించిన కలెక్టర్,ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. విధుల్లో సమయపాలన పాటించడం తో ముఖ్యంగా ఓ.పీ సమయాల్లో వైద్యులు తప్పనిసరిగా హాజరై ఉండాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే.. రాజమార్గం..!

**జగిత్యాలలో మెగా లోక్ అదాలత్ సక్సెస్**
**కృషి చేసిన పోలీస్‌లకు ప్రశంసా పత్రాలు**



**జగిత్యాల ప్రతినిధి, మార్చి7 (నినాదం) :** రాజీమార్గమే రాజమార్గం అనే నినాదంతో జగిత్యాలలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ సక్సెస్ అయింది ఈ సందర్భంగా మంగళ వారం జిల్లాలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సక్సెస్ చేయడంలో కీలక పాత్ర పోషించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి జగిత్యాల బార్ అసోసియేషన్ సభ్యులను జిల్లా జడ్జి శ్రీమతి రత్న పద్మావతి అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లా పరిధిలో మొత్తం 3034 కేసులు పరిష్కారానికి నోచుకున్నాయి . ఈ విజయానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు బార్ అసోసియేషన్ ప్రతినిధులను ఈ రోజు జిల్లా కోర్టు ప్రాంగణంలో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి శ్రీమతి రత్న పద్మావతి గారు మాట్లాడుతూ, పోలీస్ అధికారులు, బార్ అసోసియేషన్, కోర్టు సిబ్బంది సమిష్టిగా కృషి చేసి కేసుల్లో ఉన్న కక్షిదారులను స్వయంగా కలిసి "రాజీ మార్గమే రాజమార్గం" అని అవగాహన కల్పించినందువల్లే ఈ స్థాయిలో కేసులు పరిష్కారం కావడం సాధ్యమైందన్నారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని, ఇరు వర్గాలకు న్యాయం చేకూరుతుందని తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా భారీ స్థాయిలో కేసులు పరిష్కరించడంలో సమన్వయంతో పనిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు బార్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తూ, రానున్న రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపిఎస్ గారు, అదనపు జిల్లా జడ్జి శ్రీ నారాయణ గారు, లీగల్ సెల్ సెక్రటరీ శ్రీ వెంకట మల్లిక్ సుబ్రమణ్య శర్మ గారు, మేజిస్ట్రేట్ లు లావణ్య,నికిషా, డిఎస్పి రఘు చందర్, బార్ కౌన్సిల్ జగిత్యాల అధ్యక్షులు, అలాగే జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి

**భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**



**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్7 (నినాదం):** ప్రస్తుత పోటీ ప్రపంచంలో పోటీని ఎదుర్కొనేందుకు విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం అయన తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ ,జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ లతో కలిసి నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం బైరవుని బండ, పేర్క కొండారం గ్రామాలలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం జిల్లా పరిషత్తు హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు పోటీని తట్టుకొని నిలబడేందుకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని సంపాదించాలని, విద్యార్థులకు తలెత్తే సందేహాలను ఉపాధ్యాయుల ద్వారా అలాగే గూగుల్ ద్వారా నివృత్తి చేసుకోవాలని , అందుకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు ప్రజలకు అవసరమైన పనులను చేసేందుకు కృషి చేయాలని, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు పేదవారికి అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, నల్గొండ ఆర్ డి ఓ వై. అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఈ ఈ గిరిధర్ ,సర్పంచ్ నాగలక్ష్మి ,ఎంఈఓ ,మార్కెట్ కమిటీ చైర్మన్ ,తహసిల్దార్, ఎంపీడీవో ,తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**మిర్యాలగూడ ఏప్రిల్ 7( నినాదం) :** రక్తదానం చేయండి ప్రాణదా తలు కండి అని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం జనయేత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ మునీర్ రక్తదాన శిబిరం రాష్ట్రపతి అవార్డు గ్రహీత సాజిదా ఖాన్ ప్రారంభించారు . ముఖ్య అతిథులుగా డి.ఎస్.పి రాజశేఖర్ రాజు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు తన అనుబంధం గత ఏడు సంవత్సరాలుగా కొనసాగుతుందని, డాక్టర్ గ చేసే ఎన్నో సేవా కార్యక్రమాలు ముఖ్యఅతిథిగా తమని భాగం చేసుకోవడం ఆనందంగా ఉందని జనయేత్రి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు ఇంకా ఎన్నో పేద ప్రజలకు అందాలని తెలిపారు. రక్తదాన శిబిరంలో సేకరించిన రక్తాన్ని గర్భిణీ స్త్రీలకు, కిడ్నీ డయాలసిస్ పేషంట్లకు, రోడ్డు ప్రమాద బాధితులకు, తలసేమియా పిల్లల సహాయార్థం కోసం ఇలాంటి బ్లడ్ బ్యాంకులో ఇంకా ఎన్నో నిర్వహించాలని వారు కోరారు. కార్యక్రమంలో గాయం ఉపేందర్ రెడ్డి , హాజారుద్దీన్ , సైదులు తదితరులు పాల్గొన్నారు .



## ప్రతి ఇంటికి పెద్ద కొడుకుగా పనిచేస్తా..





**వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 7 (నినాదం) వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి తాను పెద్దకొడుకుగా పని చేస్తానని, నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలో పలు ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు తన తరపున పుట్టింటి కానుకగా నూతన వస్త్రాలను అందించి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. 20వ వార్డుకు చెందిన ఏర్పుల శాంతమ్మ గురువయ్య, రామేశ్వరమ్మ బాలస్వామి, 15 వ వార్డుకు చెందిన అలివేల నరేందర్, 33 వ వార్డుకు చెందిన నస్రీన్ బేగం అబ్దుల్ రెహమాన్ ల కుటుంబాలకు ఆయన నూతన వస్త్రాలను అందించారు. తమ సొంత ఇంటి కల నెరవేరుతుందో లేదో అని భయపడిన తమకు కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు లక్షలు ఇచ్చి తమ సొంత ఇంటి కల నెరవేర్చినందుకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నో రాజ్యాలు మారాయి రాజకీయ నాయకులు మారారు గాని ఒక ఇల్లు కట్టించలేదని, కాని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు చేయూతనిస్తూ సొంత ఇంటిని ఏర్పాటు చేస్తుందని వారు చెప్పారు. ఈ సందర్భంగా సొంత ఇంటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డు అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ పాకనాటి కృష్ణ, నాయకులు ఎల్ఐసి కృష్ణ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

N NADAM CINEMA

# అట్లీ, అల్లు అర్జున్ మూవీ పోస్టర్ విడుదల




అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. 'ఎఎ22ఎక్స్ 6'గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్‌ను చిత్రబృందం పంచుకుంది. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం దీని టైటిల్‌ను ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని తెలుపుతూ టీమ్ పంచుకున్న పోస్టర్ అందరిలో ఆసక్తి కలిగించింది. సాధారణంగా టైటిల్ ప్రకటన అంటే హీరో లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను పంచుకుంటారు. కానీ టీమ్ మాత్రం జంతువు పంజా ఉన్న పోస్టర్‌ను షేర్ చేసింది. దీంతో ఈ సినిమా థీమ్‌పై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అట్లీ ఏం ప్లాన్ చేస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడి ఉండే సైన్స్‌ఫిక్షన్ మూవీగా ఇది ముస్తాబవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో అల్లు అర్జున్ పాత్ర మూడు కోణాల్లో సాగుతుందని సమాచారం. మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ వినియోగంతో పాటు... విజువల్ ఎఫెక్ట్స్‌కి పెద్దపీట వేస్తూ ఈ సినిమాని భారీస్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇందులో ముగ్గురు కథానాయికలు ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో దీపికా పదుకొణె పేరు ఇప్పటికే ఖరారైంది.

## ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ





'ధురంధర్ 2' ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామీ సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ హై వోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, దేశ విదేశాల్లోని పలు ఇంటర్నేషనల్ లొకేషన్స్‌లో షూటింగ్ చేస్తున్నారట. ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్, సూర్యకు ఉన్న నటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

## పెద్ది విడుదల జూన్‌కు మారినట్లేనా?




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదల తేదీపై గందరగోళం నెలకొంది. మొదట ఈ సినిమాను ఏప్రిల్ 30న విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, తాజా పరిణామాలు చూస్తుంటే ఆ తేదీకి రావడం కష్టమేనని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల 'చెన్నై లవ్ స్టోరీ' ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ సినిమా వాయిదా పడే అవకాశాలపై వ్యాఖ్యలు చేయడంతో మెగా అభిమానులు తీవ్రంగా స్పందించారు. ఈ వ్యాఖ్యలపై వివాదం రేగడంతో ఆయన తర్వాత వివరణ ఇచ్చారు. మరోవైపు, 'రాకాస' టీంతో మాట్లాడిన సమయంలో 'సినిమా లేట్ అవ్వదు' అని రామ్ చరణ్ స్వయంగా చెప్పడంతో ఫ్యాన్స్ కాస్త కూల్ అయ్యారు. అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తే వాయిదా అనివార్యంగా కనిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' సినిమా జూన్ నెలలో విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం చిత్ర యూనిట్ రెండు తేదీలను పరిశీలిస్తోంది. జూన్ 4 లేదా జూన్ 24. ఈ తేదీల్లో ఏదో ఒకదానిని ఫైనల్ చేయాలని భావిస్తున్నారు. త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. కీలక సన్నివేశాల్లో రామ్ చరణ్ పాల్గొంటూ బిజీగా ఉన్నారు. సినిమాను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు టీమ్ కష్టపడుతోంది. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ముఖ్య పాత్రల్లో శివరాజ్ కుమార్, జగపతిబాబు , అలాగే 'మిర్జాపూర్' ఫేమ్ దివ్యేందు శర్మ కనిపించనున్నారు. సంగీతాన్ని ఏఆర్ రెహమాన్ అందిస్తుండగా, ఇప్పటికే విడుదలైన పాటలు మంచి స్పందన పొందాయి. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రాగానే ప్రమోషన్స్‌ను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేలా యూనిట్ ప్లాన్ చేస్తోంది.

## అవును పెళ్లయ్యింది..

**నటి త్రిష ఘాటు రిప్లై**



కొన్ని రోజులుగా నటి త్రిష పేరు సోషల్ మీడియాలో వైరలవుతోన్న విషయం తెలిసిందే. నటుడు, టీవీకే అధినేత విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా త్రిష సినిమాలు మానేస్తున్నారని నటుడు చిత్రా లక్ష్మణన్ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై ఆమె తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. అవును సినిమాలు మానేశాను. ఒక పెద్ద వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా?. ఈరోజు మీరు వార్తలు రాసుకోవడానికి ఇది చాలా.. మరేదైనా జోడించమంటారా' అంటూ వ్యంగ్యంగా రాసుకొచ్చారు.. దీంతో ఆమె సినిమాలు మానేయనున్నారంటూ వస్తోన్న వార్తలకు చెక్ పడినట్లైంది. అసలేం జరిగిందంటే.. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు చిత్రా లక్ష్మణన్ బదులిచ్చారు. ఇకపై సినిమాల్లో కొనసాగాలని త్రిష అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదన్నారు. దీంతో ఎన్నో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టనున్నారని వార్తలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో వీటికి తనదైన స్టైల్‌లో త్రిష బదులిచ్చారు. ప్రస్తుతం ఆమె సూర్య 'కరుప్పు'(తెలుగులో 'వీరభద్రుడు'), 'విశ్వంభర'లో నటిస్తున్నారు.

## అనన్య పాండే మూవీ చాంద్ మేరా దిల్




బాలీవుడ్ యువ నటి అనన్యా పాండే, 'కిల్' సినిమాతో మెప్పించిన లక్ష్య జంటగా నటిస్తున్న కొత్త సినిమా 'చాంద్ మేరా దిల్'. ఈ సినిమా మే 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. హైదరాబాద్ నేపథ్యంలో రాబోతున్న ఈ టీజర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన క్యాంపస్ లవ్ స్టోరీ అని అర్థమవుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ కాలేజీలో ఆరవ్, చాందిని అనే ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన ప్రేమ, ఆ తర్వాత వారి జీవితాల్లో ఎదురైన మలుపులు, బాధాకరమైన సంఘటనలను ఈ సినిమాలో చాలా ఎమోషనల్‌గా చూపించబోతున్నారు. మరో విశేషమే మిటంటే, ఈ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం హైదరాబాద్‌లోనే జరిగింది, ఇది తెలుగు ప్రేక్షకులకు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తోంది. సచిన్-జిగర్ అందించిన మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. నిజానికి ఈ సినిమా ఏప్రిల్‌లోనే రిలీజ్ కావాల్సి ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేసి, ఇప్పుడు మే 22న థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

## బ్రేకప్ స్టోరీ బయటపెట్టిన బేబమ్మ



మోస్ట్ బ్యూటిఫుల్ నటి కృతి శెట్టి తాజాగా నటుడు, దర్శకుడు అయిన ప్రదీప్ రంగనాథన్ హీరోగా రూపొందిన (లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ) చిత్రంలో హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాను ఏప్రిల్ 10వ తేదీన విడుదల చేయనున్నారు. ఈ చిత్ర విడుదల తేదీ దగ్గర పడడంతో కృతి శెట్టి వరుసగా ఇంటర్వ్యూలలో పాల్గొంటూ ఈ సినిమాను ప్రమోట్ చేస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె తన వ్యక్తిగత విషయాల గురించి ఓపెన్ అయింది. కృతి శెట్టి మాట్లాడుతూ... "నాకు చాలా సంవత్సరాల క్రితం బ్రేకప్ అయ్యింది. ఆ విషయం మా అమ్మకి కూడా తెలుసు. ఇక ప్రస్తుతం మాత్రం నేను సింగిల్‌గానే ఉంటున్నాను" అని తన లవ్ స్టేటస్ గురించి చెప్పింది. అలాగే నెగటివిటీని అస్సలు తట్టుకోలేనని, ఎవరైనా సోషల్ మీడియా వేదికగా అసభ్యంగా ప్రవర్తిస్తే కచ్చితంగా వారిని బ్లాక్ చేస్తానని ఏమాత్రం మొహమాటం లేకుండా చెప్పేసింది. ఇందులో ఎస్.జె. సూర్య కీలక పాత్రలో నటించగా విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించాడు.

ÔáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787